


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 26 ఫిబ్రవరి 2026 | 13 పేజీలు


### నాయకులుగా కాదు..


# సేవకులుగా పని చెయ్యాలి

- ధర్మపురి మున్సిపల్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ
- హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**సూర్య ధర్మపురి:**

ప్రజలు ఇచ్చిన అధికారంతో ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయవద్దని మున్సిపల్ పాలకవర్గంలో ఎన్నికైన వారు నాయకులుగా కాకుండా సేవకులుగా పనిచేయాలనీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి మున్సిపల్ నూతన పాలక వర్గానికి సూచించారు. బుధవారం మున్సిపల్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు (మిగతా 2లో)





### సమాచార హక్కు చట్టం

# కాగితాలకే పరిమితం?

- అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం

**సూర్య కొడిమ్యాల**

సమాచార హక్కు చట్టం (స.హ. చట్టం) అమలులో జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చట్టం ప్రకారం నిర్దిష్ట కాలవ్యవధిలో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అనేక దరఖాస్తులు సంవత్సరం దాటినా పరిష్కారం కాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొత్తగా ఎన్నికైన కమిషనర్లు ప్రభుత్వ అధికారులతో సమావేశమై పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల (పి ఐ ఓ )లు బాధ్యతలు, అప్పీలు, పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి నిర్లక్ష్యం చేసిన అధికారులకు జరిమానాలు విధించినప్పటికీ, ఫీల్డ్ స్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించడంలేదని అంటున్నారు. సిరిసిల్ల జిల్లాలో ఆర్టీఐ దరఖాస్తుదారుడు అక్కపెల్లి రవీందర్ 12-07-2024న (మిగతా 2లో)




## లక్ష్యానికి చేరువలో రుణాల పంపిణీ

- కలెక్టర్ పమేలా సత్పతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి** (వివరాలు లోపలి పేజిల్లో)

## సమయపాలనలో లోపాలు...

- ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తున్న కార్యాలయాలు
- "ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్‌లో ఉన్నాం" అంటూ అధికారుల సమాధానం

**సూర్య, ముస్తాబాద్**

(వివరాలు లోపలి పేజిల్లో)

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై వస్తున్న ఆరోపణల్లో నిజమెంత..!

- అధికారిక విచారణ ఫలితం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

**సూర్య-గోదావరిఖని:** (వివరాలు లోపలి పేజిల్లో)

### ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి

# తక్షణ వేదికగా గ్రీవెన్స్ సెల్

- ట్రాఫిక్ సేవలన్నీ ఒకే చోట పొందేలా ఏర్పాటు
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం
- నూతన రిసెప్షన్, గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి** 2లో





### జిల్లాలో మొదటి రోజు

# ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు 30 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. జనరల్ కోర్సులకు సంబంధించి 6879, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1029 విద్యార్థులు హాజరు కాగా 253 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.స్థానిక ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును, పరీక్ష కేంద్రంలో కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల హాజరు శాతం,పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే అదనపు కలెక్టర్ రెవెన్యూ (మిగతా 2లో)

### చెరువులు, కుంటలు, కాలువలపై

# అక్రమ నిర్మాణాల దూకుడు...

- ఇరిగేషన్-పంచాయతీ శాఖల మధ్య బాధ్యతల తిప్పలు
- అక్రమాలకు నూతన పంచాయితీ పాలకవర్గం అండదండలు ఉన్నాయని గ్రామంలో చర్చ.!
- నిర్మాణాలు నిలిపివేసి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్
- నీటిపారుదల శాఖ భూములని చేతులు దులుపుకుంటున్న పంచాయతీ కార్యదర్శి..

**సూర్య, ముస్తాబాద్** 2లో





# నాయకులుగా కాదు.. సేవకులుగా పని చెయ్యాలి

(మొదటి పేజి తరువాయి)
15 వార్డులకు గాను 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ధర్మపురి ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. 2009 నుంచి దినేష్ తనకు అండగా నిలిచారని మంత్రి అన్నారు. నియోజకవర్గంలో మంచి చెడులకు తానే బాధ్యత వహిస్తానని మంత్రి తెలిపారు. తప్పకుండా అందరికి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కౌన్సిల్ సభ్యులు సూచించిన సమస్యలతో పాటు ప్రజల సమస్యలు పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా నిధులు విడుదల చేయడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.ధర్మపురి పట్టణంలోని ప్రతి ఇంటికి తాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. పుష్కరాలు వస్తున్న నేపథ్యంలో ధర్మపురి కి నిధులు విడుదల చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారన్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ధర్మపురిని అభివృద్ధి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే ధర్మపురి లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటానని మంత్రి తెలిపారు.ఈ నెల 27న పుష్కరాల ఏర్పాట్లపై ధర్మపురికి ప్రభుత్వం తరపున కన్సల్టెన్సీ ప్రతినిధులు వస్తున్నారని మంత్రి తెలిపారు. పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి పుష్కరాల ఏర్పాట్లకు సలహాలు సూచనలు ఇవ్వాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు.మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు 15మందికి 15మందిని గెలిపించడానికి కృషి చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని అన్నారు.మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న మాట్లాడుతూ మంత్రి లక్ష్మణ్ కుమార్ చొరవతో పుష్కరాలను విజయవంతం చేస్తామని అన్నారు. జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ నూతన పాలకవర్గం అభివృద్ధి, సంక్షేమం రెండింటిని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని కోరారు. పారిశుద్ధ్యం, తాగు నీటి సమస్య పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం కాగితాలకే పరిమితం?

(మొదటి పేజి తరువాయి)
ఆర్డీఓ కార్యాలయానికి 2022లో జిల్లాలో ల్యాండ్ సర్వేకు ఎంతమంది చలానాలు చెల్లించారో, వాటిపై ఏ చర్యలు తీసుకున్నారో, కార్యాలయ పరిధిలోని మండలాల సంఖ్య, సిబ్బంది, ప్రభుత్వ వాహనాల వివరాలు కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. సంవత్సరం గడిచినా సమాచారం అందకపోవడంతో 18-01-2025న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై 04-03-2025న జిల్లా రెవెన్యూ అధికారి ఆ దరఖాస్తు తమ పరిధిలోకి రాదని తెలిపినట్లు సమాచారం. అదే దరఖాస్తుపై జిల్లా భూమి కొలతల అధికారి కోరిన సమాచారం ఆర్టీఐ పరిధిలోకి రాదని, 2(ఎఫ్) కింద వస్తుందని పేర్కొంటూ సమాధానం ఇవ్వలేదు. దాదాపు సంవత్సరం కాలయాపన జరిగినప్పటికీ సమాచారం అందలేదని తెలుస్తోంది. అలాగే 02-12-2022న సిరిసిల్ల

జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల సంఖ్య, అవి పాటిస్తున్న నిబంధనలు తదితర వివరాలు కోరుతూ ఇచ్చిన దరఖాస్తుకూ సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయని ఆరోపణలు ఉన్నాయి. కొడిమ్యాల మండల పరిషత్ కార్యాలయంలో 2024 నుంచి పలు అంశాలపై, ముఖ్యంగా చెప్యాల గ్రామానికి సంబంధించిన వివరాలపై సమాచారం కోరినా పంచాయతీ కార్యదర్శి స్పందించలేదని అంటున్నారు. అప్పీలు చేసినా సమాధానం లభించలేదని తెలిపారు. కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయానికి ఇచ్చిన దరఖాస్తులు నెలలు గడిచినా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.కరీంనగర్‌లోని అసిస్టెంట్ ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయానికి దేవస్థానం భూముల స్వాధీనం, వాటి అధీనంపై వివరాలు కోరుతూ ఇచ్చిన దరఖాస్తుపైనా స్పందనలేదని ఆరోపించారు. పూడూరు విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయానికి ఇచ్చిన దరఖాస్తుపైనా సమాచారం అందలేదని తెలిపారు. అప్పీలు చేసినా స్పందన లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, అసిస్టెంట్ కలెక్టర్లు చొరవ చూపి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి సమాచార హక్కు చట్టాన్ని కాపాడాలని ఆర్టీఐ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ రాష్ట్ర కమిషనర్లు, ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు బుధవారం వెల్లడించారు.

# ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ వేదికగా గ్రీవెన్స్ సెల్

**- ట్రాఫిక్ సేవలన్నీ ఒకే చోట పొందేలా ఏర్పాటు - కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**- నూతన రిసెప్షన్, గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ మరియు గ్రీవెన్స్ సెల్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం అధికారికంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సామాన్య ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా అధికారులకు విన్నవించుకునేందుకు ఈ గ్రీవెన్స్ సెల్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.దీని ద్వారా



ట్రాఫిక్ ఉల్లంఘనలు, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులపై ప్రజలు ఇక్కడ నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రజలు తమ విలువైన సలహాలను, సూచనలను అందించవచ్చు. బాధితుల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును రికార్డ్ చేసి, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. చలాన్ల వివరాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన వంటి అన్ని రకాల ట్రాఫిక్ సంబంధిత సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి.?పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ గ్రీవెన్స్ సెల్ సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ , భీంరావు, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్ ఇతర పోలీసు అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

**- పాల్గొన్న సీపీ గౌష్ ఆలం.**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



నగరంలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.?ముస్లిం సోదరులతో కలిసి సీపీ ఉపవాస దీక్షను విరమించి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు మత సామరస్యానికి ప్రతీక అని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.?ఈ కార్యక్రమంలో సీపీతో పాటు భీంరావు (అడిషనల్ డీసీపీ), యాదగిరిస్వామి (ఏసీపీ ట్రాఫిక్ ), విజయకుమార్ (ఏసీపీ రూరల్ ),?ట్రాఫిక్ విభాగం సిబ్బంది,స్థానిక ముస్లిం సోదరులు సిబ్బందిపాల్గొని, మతసామరస్యాన్ని చాటారు.

# జిల్లాలో మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

(మొదటి పేజి తరువాయి)
బిఎస్ లత కోరుట్లలోని ప్రభుత్వ బాలుర బాలికల కళాశాలను మెట్పల్లి మెట్ పల్లి బాలుర జూనియర్ కళాశాల, నలంద జూనియర్ కళాశాలలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరీక్ష కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ కె ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి పదినిమిషాలు లేటుగా రావడం వల్ల అనుమతించలేదు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, జిల్లాలో మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు.

# చెరువులు, కుంటలు, కాలువలపై అక్రమ నిర్మాణాల దూకుడు...

**సూర్య, ముస్తాబాద్**

మండలంలో చెరువులు,కుంటలు,కాలువలపై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వానికి చెందిన జల వనరుల భూములను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ డి.ఈ.ను వివరణ కోరగా,"హద్దులు చూపించడం మా బాధ్యత మాత్రమే.ఆ హద్దులలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే అవి అక్రమాలు. వాటిని తొలగించే బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శిదే" అని తెలిపారు. అదే అంశంపై గ్రామసభలో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా,"ఇది ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయం"అంటూ సమాధానం ఇవ్వడంతో ప్రజలు మరింత గందరగోళానికి గురయ్యారు.ఒక శాఖ మరొక శాఖపై బాధ్యత నెట్టివేయడంతో అక్రమ నిర్మాణాలపై ఎవరిని ప్రశ్నించాలి అన్న సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు.ఇదిలా ఉండగా,ఈ అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ సర్పంచ్,నూతన పాలకవర్గం అండదండలు ఉన్నాయనే చర్చలు గ్రామంలో వినిపిస్తున్నాయి.అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ప్రభుత్వ భూములు క్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేసి,ఆ నిర్మాణాలు ఎవరికి చెందినవో గుర్తించి,చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.




# లక్ష్యానికి చేరువలో రుణాల పంపిణీ

**- కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2025 నుంచి డిసెంబర్ 2025 వరకు జిల్లాలో రూ.11,358.47 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.4,665.81 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.2,329.25 కోట్లు, ఎస్ఎచ్జీ రుణాలకు రూ.918.38 కోట్లు తదితర రంగాలకు రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 84.55% లక్ష్య సాధన జరగడంతో బ్యాంకర్లను అభినందించారు.ఖణజజదీ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో బ్యాంకర్లు, శాఖాధికారులతో రుణాల పంపిణీ, రికవరీ, పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి తదితర పథకాల పురోగతిపై సమీక్షించారు. అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేయడంతో పాటు పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. "ఖ్జ -- సురక్షిత బ్యాంకింగ్‌కు మీ తొలి అడుగు" కార్యక్రమం ద్వారా వినియోగదారులు తమ ఖాతాలను నవీకరించుకోవాలని సూచించారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలకు ఖణ+ూవీ పోర్టల్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# శ్రీ దత్తాత్రేయ ఆలయ ప్రధాన అర్చకులు మృతి..

**- సంతాపం వ్యక్తం చేసిన భక్తులు..**

**సూర్య బోయినపల్లి..**



మండలం, వరదవెల్లి గ్రామం లో బుదవారం రోజు వరదవెల్లి శ్రీ దత్తాత్రేయ స్వామి ప్రదాన అర్చకులు శ్రీ సంకెపెల్లి చెంద్రమౌళి పంతులు మృతి చెందరు.ఇందుకుగాను వరదవెల్లి లో శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వారు లేని లోటును ఎవ్వరు తీర్చలేరని వరదవెల్లి గ్రామ ప్రజలు భక్తులు చాలా దిగ్రాంతికి లోనయ్యారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

రాజన్న సిరిసిల్ల

గురువారం 26 ఫిబ్రవరి 2026




# సిరిసిల్లలో యాంకర్ సుమ, 'బుల్లి రాజు'ల సందడి

**- ఘనంగా 'వాసవి వస్త్రాలయ' షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం**

**- హైదరాబాద్‌కు దీటుగా సిరిసిల్లలో సరికొత్త షాపింగ్ అనుభూతి**

**సూర్య, రాజన్న సిరిసిల్ల.**

ప్రముఖ యాంకర్, సినీ నటి సుమ కనకాల, 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఫేమ్ చైల్డ్ ఆర్టిస్ట్ బుల్లి రాజులు బుధవారం సిరిసిల్ల పట్టణంలో సందడి చేశారు. స్థానిక మార్కండేయ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వాసవి వస్త్రాలయ' షాపింగ్ మాల్‌ను వారు ముఖ్య అతిథులుగా హాజరై అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ప్రముఖులను చూసేందుకు ప్రజలు భారీగా తరలిరావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. హైదరాబాద్‌కు చెందిన 'దివ్య ఎంటర్ప్రైజెస్' సంస్థ ఆధ్వర్యంలో ఈ వాసవి వస్త్రాలయను ఏర్పాటు చేశారు. సిరిసిల్ల ఆడపడుచులకు వినూత్నమైన, సరికొత్త డిజైన్లతో కూడిన వస్త్రాలను అందించాలనే సదుద్దేశంతో ఈ మాల్‌ను తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ షాపింగ్ మాల్స్‌కు దీటుగా సిరిసిల్ల ప్రజలకు సరికొత్త అనుభూతిని పరి



చయం చేయడంతో పాటు, ప్రతిరోజూ ఆకర్షణీయమైన ఆఫర్లతో కస్టమర్లకు సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు.

**- అందుబాటు ధరల్లో ఆధునిక వస్త్రాలు**

**- యాంకర్ సుమ**

షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా యాంకర్ సుమ మాట్లాడుతూ, సిరిసిల్ల పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో, ఆధునిక డిజైన్లతో కూడిన వస్త్రాలు ఇక్కడ లభిస్తాయని వెల్లడించారు. పట్టణ ప్రజలు తమ ఇళ్లలో జరిగే వివాహాది శుభకార్యాలకు, ఇతర ఫంక్షన్లకు వాసవి వస్త్రాలయను తమ మొదటి ఎంపికగా చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెప్పదండి ప్రకాష్‌లతో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అభివృద్ధికి 'విప్' సంకల్పం...

**- వేములవాడ రూరల్‌లో నిధుల వర్షం - వట్టెంల గ్రామంలో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**సూర్య, వేములవాడ**

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉద్ఘాటించారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో ఆయన పర్యటించి, సుమారు 2 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ 26 లక్షలతో సీసీ రోడ్లు, 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం, 12 లక్షలతో అంగన్వాడీ భవనం, 10 లక్షలతో మహిళా సమైక్య భవనం, ఓపెన్ జిమ్, ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వట్టేముల–చెక్కపల్లి రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



మహిళా సాధికారతపై మాట్లాడుతూ "మహిళలను కేవలం సమావేశాలకు పరిమితం చేయకుండా, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శిస్తూనే, తమ ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతలుగా వడ్డీ నిధులను మహిళల ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వట్టేముల జంక్షన్‌ను మోడల్ జంక్షన్‌గా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



# ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలి

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ - రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం**

**- హాజరైన అదనపు ఎస్పీ చంద్రయ్య, వివిధ శాఖల అధికారులు**

**సూర్య, రాజన్న సిరిసిల్ల.**

ప్రణాళిక ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పీఆర్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్, వైద్య, ఎక్సైజ్, విద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్ష సమావేశం అదనపు కలెక్టర్ నిర్వహించారు. ముందుగా గతనెలలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సందర్భంగా చర్చించిన అంశాలపై సమీక్ష చేశారు. రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, పోలీస్ శాఖ సంయుక్తంగా చేసిన సర్వే వివరాలపై ఆరా తీశారు. వివిధ ప్రధాన రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, సోలార్ సిగ్నల్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు పైకి అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. పలు జంక్షన్లు, రహదారుల్లో స్పీడ్ గన్స్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న వాటిని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్‌లలో కచ్చితంగా "నో హెల్మెట్.. నో పెట్రోల్" అమలు చేయాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోలు, బస్సులను తనిఖీ చేయాలని, ఓవర్ లోడ్ తో వెళ్ళే సరుకు వాహనాలపై దృష్టి సారించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు



సంగీతం శ్రీనాథ్, ఈఈ ఆర్ అండ్ బీ నరసింహాచారి, ఈఈ నేషనల్ హై వేస్ సురేష్ రాథోడ్, డీటీఓ లక్ష్మణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, నేషనల్ హైవే డీఈ అన్నయ్య, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు

**- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సౌజన్య**

**సూర్య, వేములవాడ**



హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి శాఖ అధికారి సౌజన్య తెలిపారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతి బాలుర కళాశాల వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న బీసీ హాస్టల్ విద్యార్థి, విద్యార్థులకు పరీక్షకు సంబంధించి సబ్జెక్టు వారి నిపుణలతో పరీక్ష విధానం, పరిక్షలో ఏలాంటి బత్తిడి లేకుండా రిధిక్ మార్కులు సాధించటానికి పలు సూచనలు, మనో విజ్ఞాన అధ్యాపకులచే ప్రేరణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అద్యాపకులు సూచనలు పాటిస్తు ఏలాంటి బత్తిడి లేకుండా పరీక్షలకు హాజిర్తి జిల్లాలో ఆ బీసీ హాస్టల్ విద్యారులు, విద్యార్థినులు అత్యదిక్ మార్కులు సాధించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామాగ్నిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయం సూపర్డెంట్ రేవంత్, ఆధ్యాపకులు, హస్టల్ వెల్ఫేర్ అఫీసర్స్, కొడం లక్ష్మి, నారాయణ, జ్యోతి, రాజశేఖర్, నరేశ్, కళ్యాణి ఉన్నారు.

## అదనపు బిల్డింగ్ పనులు ప్రారంభం

**సూర్య, తంగళ్ళపల్లి**



మండలంలోని మండేపల్లిలో రూ.5 లక్షల నిధులతో యాదవ సంఘం అదనపు పనులను సర్పంచ్ గదగొని సాగర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం, ఉప సర్పంచ్ సందీప్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోనీ, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు హరికా రెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భూపతి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఐదుగురు దొంగలు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**- సీఐ మొగిలి**

**సూర్య, తంగళ్ళపల్లి**



తల వెంట్రుకలను దొంగిలించిన ఐదుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన అబ్బ వేణి చిన్న ఎల్లయ్య తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ ఉంటాడు. జనవరి 10, 2026 రోజున 8 క్వింటాళ్ల తల వెంట్రుకలను బొలెరోలో లోడ్ చేసుకుని జగిత్యాల నుండి హైదరాబాద్ వెళుతుండగా తంగళ్ళపల్లి మండలం పద్మ నగర్ పెట్రోల్ బంక్ వద్ద ఏడుగురు వ్యక్తులు ఆర్టీవో అధికారుల లాగా బెదిరించి వాహనాన్ని ఎత్తుకెళ్లాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తంగళ్ళపల్లి ఎస్సై ఉపేంద్ర చారి కేసు నమోదు చేశాడన్నారు. ఎస్సై తన సిబ్బందితో టీమును ఏర్పాటు చేసి ఖమ్మం జిల్లాకు చెందిన బొజ్జ కనకయ్య, అంగులూరి ఎస్పాల్, ఎంద్రాతి ఉపేందర్, తీల్ ఫితియా సన్నీ డాల్ సింగ్, రెవిని క్రాంతిలను అరెస్టు చేశారన్నారు. మరో ఇద్దరు కూడా ఉన్నట్టు గుర్తించామని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్న ఎస్సై ఉపేంద్ర చారి, కానిస్టేబుల్స్ సంపత్, శ్రావణ్, శ్రీనివాసులను సిఐ అభినందించారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**సూర్య, తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలం రామచంద్రపూర్‌లో జాతీయ ఉపాధి హామీ పనులను గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంధం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొన్నాల నరసింహులు, వార్డు సభ్యులు గడ్డం లహరి, గంధం లక్ష్మి, గంధం రమేష్, శేఖర్, అమృత, మాధవరెడ్డి, చక్రపాణి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా బుధవారం జగిత్యాల ఎస్.కె.ఎన్.ఆర్ (బాలుర) జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్ర పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు విషయాన్ని అధికారులు పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని కోరారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో డిఐఈవో నారాయణ, తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపైన గల గుంతను పూడ్చిన ఎస్సై

**సూర్య, గొల్లపల్లి**



గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో రోడ్డు పైన గల గుంతలను ఆర్ డబి వారి సహకారంతో స్థానిక ఎస్ఐ వీ. కృష్ణ సాగర్ రెడ్డి గశ్రీరోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చొరవతో పూడిపించినారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములపల్లి గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది మరియు ఆర్ & బి సిబ్బంది పాల్గొన్నారు.

## పైప్ లైన్ రిపేర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

**- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం - పనుల పరిశీలన**

**సూర్య, మెట్‌పల్లి**



మిషన్ భగీరథ పైప్ లైన్ రిపేర్ పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత లేని పైప్‌లు తొలగించి నాణ్యమైన నూతన పైప్‌లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం భగీరథ ఏఈ, కాంట్రాక్టర్ లను ఆదేశించారు. బుధవారం వెంకట్రావ్ పేట్ వద్ద లీకైన మిషన్ భగీరథ పైప్ లైన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బా గ్రామం నుండి జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతుందని. గతంలో కాంట్రాక్టర్ నాణ్యత లేని పైప్‌లు ఏర్పాటు చేయడం తరచూ లీకేజ్‌లు ఏర్పడి జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా నిలిచిపోతుందని. పాత పైపులు తీసివేసి కొత్త పైపులు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ పైపులు లీకేజీలు ఏర్పడితే కాంట్రాక్టర్ పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని. నీటి సరఫరా నిలిచిపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. లీకేజ్ పనులు పూర్తిచేసి నీటిని అందించాలని ఆదేశించారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుల్లూరి వెంకటేష్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మారుతి తదితరులు ఉన్నారు.

## నేటి నుండి ఇటిక్యాలలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**సూర్య,రాయికల్**



రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపించుటకు ధర్మకర్తలు చెన్నమనేని విష్ణువర్ధన్,వంశీవర్ధన్ సారథ్యంలో ఏర్పాట్లు పూర్తయినట్లు అర్చకులు మరింగంటి రామకృష్ణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మార్చి 05వ తేది వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆయన అన్నారు. ఈ నెల 28 న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, మహా అన్నదానం, మార్చి 4న బుధవారం స్వామి వారి రథోత్సవం,జాతర కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు,ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు తెలిపారు.

## కౌన్సిలర్‌గా గెలిచిన ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడికి సన్మానం

**సూర్య, మెట్‌పల్లి**

మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన టీయుడబ్ల్యూజే ఐజేయు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా గౌరవ అధ్యక్షుడు మాసుల ప్రవీణ్ ను టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు బుధవారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా టీయూడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు డా: బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజరి శివ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్, యానం రాకేష్, రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేష్, ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమార్, అమ్ముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## దహన సంస్కారాలకు ఫ్రెండ్స్ ట్రస్ట్ చేయుత

**సూర్య, మెట్‌పల్లి**



పట్టణంలోని ఇందిరానగర్‌లో పూరి గుడిసెలో నివాసం ఉంటున్న కాపర్లపాట రాజయ్య మరణించగా దహన సంస్కారాల కోసం ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దహనానికి కట్టెలు ఏర్పాటు చేసి, ఆ కుటుంబానికి రైస్ బ్యాగ్ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ట్రస్ట్ సభ్యులను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్, లంక శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య, భీమా పథకాలు చారిత్రాత్మకం

**- తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**

**సూర్య, జగిత్యాల అర్బన్**



ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, భీమా పథకాలు చరిత్రలో నిలిచి పోతాయని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. టి.పి.సి.ఏ. పెన్షనర్ల జిల్లా శాఖ సమావేశాన్ని బుధవారం జగిత్యాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను, పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఅర్సీ ప్రకటించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య పథకం పేరును ఉద్యోగులు,పెన్షనర్ల పేర్లు వచ్చే విధంగా ఇపిహెచ్ఎస్ (ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య పథకం)గా పేరు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సి. హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, నాయకులు పి.అశోక్ రావు, వి.ప్రకాష్ రావు, విఠల్, సత్యనారాయణ, సయ్యద్ యూసుఫ్, ఎం.డి.ఎక్బాల్, పబ్బా శివానందం, మురళి, గంగాదర్, కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**సూర్య, మేడిపల్లి/భీమారం**




భీమారం మండలం రంగాపూర్ ప్రాజెక్టు నుండి అక్రమంగా ఇసుకను తవ్వి మూడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను బుధవారం రోజు భీమారం గ్రామస్తులు అడ్డుకొని సంబంధిత ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ కు సమాచారం అందించారు. ఏఈ శ్రీనివాస్ హుటాహుటిన వచ్చి క్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సేఫ్ కస్టడీలోకి తీసుకొని స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాజెక్టు నుండి ఎవరైనా అక్రమంగా ఇసుకను తీసి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**సూర్య,రాయికల్**



మండలం లోని రామాజీపేట గ్రామంలో శ్రీ సత్య హాస్పిటల్ డాక్టర్ ఉదయ్ కుమార్ ఎండి, డాక్టర్ సిహెచ్ శ్వేత క్రిటికల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 234 మందికి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని దానికి అనుగుణంగా ఎముకల బలపరీక్ష, విటమిన్ డి3, ఇసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సుమారు ఒక్కొక్కరికి 3000 రూపాయలు వరకు అయ్యే పరీక్షలు ఉచితంగా చేయగా, అట్టి పరీక్షల రిపోర్టులు ఆధారంగా రోగులకు పాటించవలసిన నియమాలు వివరిస్తూ వారికున్న సమస్యను బట్టి ఉచిత మందులు అందజేశారు.

## గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేసిన డిఎల్పిఓ

**సూర్య, రాయికల్**



మండలంలోని అల్లిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంను డిఎల్పిఓ విమల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆమె తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్య పనుల గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్ డిఎల్పిఓను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ విమల మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించి గ్రామపంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి సబ్బులు,నూనెలు, బెల్లం వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి శేఖర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

**పెద్దపల్లి**

గురువారం 26 ఫిబ్రవరి 2026




# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం

### -ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**సూర్య - ఎలిగేడు**

పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్ర గామిగా నిలిపేందుకు అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు తెలిపారు. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు బుధవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై అనేక మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు.నిట్టూరు క్రాసింగ్-వెంకటారావుపల్లి-కాచాపూర్ వరకు బీటీ డబుల్ రోడ్డు, కటికనపల్లి-కుమ్మరికుంట-కీచురాపల్లి రోడ్డు, కాచాపూర్-వడకాపూర్-జూలపల్లి వరకు రహదారి అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ యూనిట్ లను సందర్శించిన అరిందం సిన్హా

**సూర్య-గోదావరిఖని**



ఎన్టీపీసీ ప్రాంతీయ కార్యనిర్వాహక సంచాలకుడు (తూర్పు ప్రాంతం-II) అరిందం సిన్హా బుధవారం ఇక్కడి ఎన్టీపీసీ కి చెందిన రామ గుండం, తెలంగాణ యూనిట్ లను సందర్శించారు. తన సమీక్షా పర్యటనలో భాగంగా ఆయన రామగుండం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, ప్లాంట్ ఆపరేషనల్ పనితీరు, కొనసాగుతున్న కార్యక్రమాలు, భద్రతా ప్రమాణాలపై సమగ్ర అవగాహన పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్లాంట్‌లో నూతనంగా అభివృద్ధి చేసిన క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం తెలంగాణ కంట్రో ల్ రూమ్‌ను సందర్శించి, ఆపరేటింగ్ బృందాలతో మమేకమై ప్లాంట్ కార్య కలాపాలపై సమీక్ష నిర్వహించారు. పర్యటనలో భాగంగా యువ అధికారు లతో, కార్మిక సంఘాలు, అసోసియేషన్ ప్రతినిధులతో సిన్హా పరస్పర సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలు పారదర్శకత, పరస్పర విశ్వాసం, సానుకూల సంభాషణకు దోహదం చేశాయి. తదుపరి బిజినెస్ యూనిట్ హెడ్, స్టేషన్ ఇన్‌చార్జీలు, విభాగాధిపతులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రస్తుత పనితీరు ప్రమాణాలు, వ్యూహాత్మక ప్రాధాన్యతలు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటన ద్వారా రామగుండం, తెలంగాణ యూనిట్లలో నాణ్యత, సమన్వయం, సమర్థత, నిరంతర అభివృద్ధికి సంస్థ నాయకత్వం కట్టుబడి ఉందని స్పష్టమైంది.

## మురికి కాలువలో డీ-షీల్టింగ్ పనులు పరిశీలించిన సర్పంచ్ పల్లె ప్రతిమ

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీలో డీ-షీల్టింగ్ పనులను బుధవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. గత కొన్ని రోజులుగా గ్రామంలోని మురికి కాలువలలో పేర్కొన్న పోయిన చెత్త చెదారాన్ని తాత్కాలిక పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా చెత్తాచెదారం పేర్కొని పోవడంతో మురికి కాలువల నుండి దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలోని అన్ని మురికి కాలువలలో డీ-షీల్టింగ్ పనులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య లోపం లేకుండా చూస్తున్నామని సర్పంచ్ పల్లె ప్రతిమపీవీ రావు తెలిపారు.

## మొర్రూర్ లో మూడు రోజులపాటు మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

### -భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే విజయవంతం చేయండి

### -జాతర కార్యనిర్వాహకులు గోపు అయిలయ్య యాదవ్

**సూర్య-గోదావరిఖని**



ఉమ్మడి రామగుండం మండలం లోని మొర్రూర్ గ్రామంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు ప్రతీకగా ప్రతి ఏటా జరుగు తున్న 'మొర్రూ ర్ కొమురన్న జాతర' ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 27 నుండి మార్చి 1 వరకు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర కార్యనిర్వాహకులు గోపు అయిలయ్య యాదవ్ తెలిపారు. ఈ మేర కు బుధవారం గోదావరి ఖని ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లా డుతూ 66 సంవత్సరాలుగా మొర్రూర్ గ్రామా నికి సమీపంలో మేడలాదేవి కేతమ్మ సహిత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవాన్ని తమ కుటుంబం విజయవంతంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గోపు కొమురయ్య వారసుల ఆధ్వర్యంలో నిర్మితమైన నూత న దేవాలయంలో శాస్త్రోక్తంగా గణపతి, సుబ్రహ్మణ్యే, కేతమ్మ, మేడలమ్మ, శివనందీశ్వర, ముత్యాల పోచమ్మ, మదన పోచమ్మ, గంగాదేవి, రేణుక ఎల్లమ్మ, ధ్వజస్తంభ సహిత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్ర మాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 27వ తేదీన విగ్ర హ ప్రతిష్టాపన కార్యక్రమా లు ప్రారంభమవుతాయని, మార్చి 1 ఆదివారం రోజున ఉదయం 5 గంట లకు మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన విగ్ర హ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అనంతరం మహాపూర్ణాహుతి, మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదానం కార్యక్ర మాలు జరుగుతాయని, భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందా లని ఆలయ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మొర్రూర్ కొమురన్న జాతర, స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం రోజున ప్రారంభమై సోమ వారం సాయంత్రం వరకు జరుగుతుందని చెప్పారు. ఈ మహోత్సవాల విజయవంతానికి గ్రామ ప్రజలు, దాతలు, భక్తులు సహకరించాలని అయిలయ్య యాదవ్ కోరారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

### -జీఎం సుంకర మధుసూదన్

**సూర్య, సెంటినరీ కాలనీ**



సెంటినరీ కాలనీ లోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్ సూచించారు. బుధవారం సెంటినరీ కాలనీ లోని డ్రైనేజీ వ్యవస్థను జీఎం సుంకర మధుసూదన్ పరిశీలించారు. ఈయన వెంట ఆర్జీ-3 సివిల్ డీజీఎం బి.రాజేంద్ర కుమార్, సూపర్ వైజర్ బెల్లం శ్రీనివాస్ ఉన్నారు

## శుభ కార్యాలయాల్లో, పరామర్శలలో పాల్గొన్న సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు

**సూర్య, సెంటినరీ కాలనీ**





రామగిరి మండలం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు బుధవారం) రోజున వివిధ శుభకార్యాలు, పరామర్శలలో పాల్గొన్నారు. సెంటినరీ కాలనీ కమ్యూనిటీ హాల్ లో కలవచర్ల మాజీ ఎంపీటీసీ కొట్టే సందీప్ పటేల్-రమ్య వివాహ వేడుకలలో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు పాల్గొని నూతన వధూవరు లను ఆశీర్వదించారు. రత్నాపూర్ గ్రామంలో పంప్ ఆపరేటర్ కండే సంజీవ్- రాజమణి గృహప్రవేశ వేడుకలలో పాల్గొన్నారు. రత్నాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడు బెజ్జాల భూమయ్యను పరామర్శించారు. రాంనగర్ లో అనారోగ్యం పాలైన కొమిరె కుమార్ ను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ బత్తుల శంకర్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను జీఎంలు సుంకర మధుసూదన్, కొలిపాక నాగేశ్వరరావు లు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్జీ-3 తరఫున కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పన్నూరు గ్రామ ఉప సర్పంచ్ కావేటి మల్లీశ్వరి, ఎస్సీ, ఎస్టీ నాయకులు బోటుకు రవీందర్, శంకర్, దయాల్ శర్మ, విజయ్ కుమార్, పేగ శైలజ, కనుకుంట్ల బానేష్, కల్లేపల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే దాసరి పుట్టినరోజు వేడుకలు

**సూర్య ఓదెల**

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి  పుట్టినరోజు సందర్భంగా ఓదెల  మల్లికార్జున స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు అర్చనలు జరిపించిన బి ఆర్ ఎస్ నాయకులు గంట రాములు యాదవ్, మాజీ ఎమ్మెల్యే  మనోహర్ రెడ్డి  ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,రాజకీయంగా మరింత ఉన్నతమైన పదవులు అధిరోహిం చాలని స్వామివారిని వేడుకున్నారు.అనంతరం దేవాలయం ముందు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది .ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఐరెడ్డి వెంకట రెడ్డి,మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్, బిఆర్ఎస్ యువత మండల అధ్యక్షులు  మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్,మద్దెవేని రవి,పోలోజు రమేష్,రౌతు జలపతి,గుండేటి మధు, మొండయ్య,తీర్థల కుమార్,బోడకుంట  నరేష్,రమణరెడ్డి,పోశెట్టి,మాట్ల రవి, మహేందర్ రెడ్డి,ఓదెల నరేందర్,పరుశరామ్,గడ్డం శ్యామ్,అరవింద్, దేవిలాల్, గోషిక కమల్,శ్రావణ్,కుమార్,రవి, అజయ్,వినయ్, శ్రీకాంత్, ముత్యాల తిరుపతి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు,యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణిలో అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థలో అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) నాయకులు అడ్రి యాల సేఫ్టీ ఆఫీసర్ కటకం కమలాకర్ కి వినతిపత్రం అందచేశారు. అడ్రియాలలో నిర్వహించిన వర్క్స్ కమిటీ మీటింగ్ కి కేవలం గుర్తింపు సంఘం మరియు ప్రాతినిధ్య సంఘాలను పిలవడం జరిగిందని, గత డిసెంబర్ నెలలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన కారణంగా తదుపరి ఎన్నికలు జరిగే వరకు అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని, అధికారిక కార్యక్రమాలకు అన్ని సంఘాలను పిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ మీనుగు సంతోష్, షిఫ్ట్ ఇన్చార్జులు రాయవేని రమేష్, తిరుపతి, వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి ఆలయానికి స్థలం కేటాయింపు

## - మంత్రికి ధన్యవాదాలు తెల్పిన ఆలయ కమిటి

**సూర్య చిగురుమామిడి**



చిగురుమామిడి శ్రీపాంబండ పంచముఖ ఆంజనేయ పీఠం ట్రస్ట్ వారి సౌజన్యంలో కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్నటువంటి శ్రీస్వయంభూ పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి పుణ్యక్షేత్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శ్రీపాంబండ పంచముఖ ఆంజనేయ పీఠం దేవస్థానానికి 3ఎకరాల 12గుంటల స్థలాన్ని కేటాయించి ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి,హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కు పాంబండ పంచముఖ ఆంజనేయ పీఠం పీఠాధిపతులు పరమహంస పరివాజకాచార్య శ్రీశ్రీశ్రీ పూజ్య గురు హూమేష్ స్వామిజి ధన్యవాదాలు తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, ఉపసర్పంచ్ కాశవేణి విజయ రాజు యాదవ్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ మరో కొండగట్టుల దిన దిన అభివృద్ధి చెందుతున్న ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు,సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డికి భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ ఆలయానికి మరిన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేసే విధంగా ప్రభుత్వం సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య,సిపిఐ జిల్లా నాయకులు తేరాల సత్యనారాయణ,బిజెపి మండల అధ్యక్షులు పోలోజు సంతోష్ కుమార్, అచ్చ రవీందర్,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొలుగూరి మోహన్ రెడ్డి,తేరాలా అమర్,మిడివెల్లి వెంకటయ్య, ముక్కెర సదానందం,భూపతి నరసింహారెడ్డి,గూడెం లక్ష్మి,కాంగ్రెస్ నాయకులు పూల లచ్చిరెడ్డి,నరసింహారెడ్డి,శ్రీనివాసరెడ్డి,అలయ సిబ్బంధి కీసర ప్రవీణ్ కుమార్,నీలిగొండ వెంకటేష్,ఆంజనేయులు,ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# గాయత్రి పంప్ హౌస్‌కు రెండు రోజుల్లో నీటి విడుదల...

**- అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం**
**- రెండు రోజుల్లో గాయత్రి పంపు హౌస్ నుండి వరద కాలువకు నీటిని విడుదల**
**- యేసంగిలో పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగు నీరు అందిస్తాం**
**- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**సూర్య రామడుగు**

చొప్పదండి నియోజకవర్గంలో రైతులు సాగు చేసిన యేసంగి పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందించి కాపాడుకుంటామని చొప్పదండిఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గాయత్రి పంపు హౌస్ నుండి వరద కాలువకు నీటి విడుదల చేయడానికి ఇరిగేషన్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆదేశాలను జారీ చేశారు. మరో రెండు రోజుల్లో వరద కాలువకు నీటిని విడుదల చేసి పంటలకు సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ శాఖ డీఈ రామ్ ప్రదీప్ ఎమ్మెల్యే సత్యంకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పక్షాల మాటలు నమ్మి రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గుంటకు సాగునీరు అందిస్తామని తెలిపారు. చొప్పదండి నియోజక వర్గాన్ని వాటర్ హబ్‌గా మార్చుతామని తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**- పరీక్షలకు సంసిద్ధం చేయండి**
**- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**సూర్య కరీంనగర్**



వచ్చే నెల 14 నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఉపాధ్యాయులకు సూచించారు.చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం అడిషనల్ కలెక్టర్ సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున రోజు విధిగా పాఠశాలకు రావాలని, ఉపాధ్యాయులతో సందేహాలు నివృత్తి చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు.మోడల్ పరీక్ష జవాబు పత్రాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు.ప్రతి విద్యార్థితో మాట్లాడి వెనుకబడిన సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూ ప్రత్యేక తరగతులకు హాజరై పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు.వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని సూచించారు. 100 శాతం మంది ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అడిషనల్ కలెక్టర్ వెంటా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి ఆనందం, ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు.

## పీఏడిపై డయాబెటిస్ బాధితులకు అవగాహన అవసరం

**- అవగాహన చికిత్స లేకుంటే కాలు పోయే ప్రమాదం**
**- డా. శ్రీకాంత్ రాజు**

**సూర్య కరీంనగర్**

డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం (పిఏడి) పై అవగాహన అత్యవసరమని సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులర్ సర్జన్ ఎండోవాస్కులర్ సర్జన్, క్లినికల్ డైరెక్టర్ యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ యూనిట్) డా. ఎస్ శ్రీకాంత్ రాజు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయాబెటిస్ ఉన్నవారిలో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పిఏడి) సమస్య వేగంగా పెరుగుతోందని, డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండి, చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. నరాల సమస్య కారణంగా కొందరిలో నొప్పి తెలియకపోవచ్చని హెచ్చరించారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి, కాళ్లు త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం, మానని గాయాలు, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో కాళ్ల రక్తపోటు పరీక్ష, డాప్లర్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు. డయాబెటిస్ రోగులు రక్త చక్కెరను కట్టుదిట్టంగా నియంత్రించుకోవాలని, పొగతాగడం పూర్తిగా మానాలని, అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు పాదాలను పరిశీలించడం, గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ముందస్తు అవగాహన, సకాలంలో చికిత్సతో కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా. శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు.

## ఘనంగా పాడి ఉదయ్ నందన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**సూర్య, వీణవంక**



యుప్ టివి అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి జన్మదిన వేడుకలు వీణవంక గ్రామంలో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ ఐటీ సంస్థల ఉద్యోగులు జన్మదిన వేడుకలు నిర్వహించారు. వీరందరూ కలిసి ఉదయ్ నందన్ రెడ్డి చేత కేక్ కట్ చేయించి, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ... ఉదయ్ నందన్ రెడ్డి మాకు కేవలం నాయకుడు మాత్రమే కాదు, ఒక మంచి మార్గదర్శి అని, ఆయన నాయకత్వంలో పనిచేయడం మాకు గర్వకారణం అని తమ అభిమానాన్ని చాటుకున్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ, వీణవంక అభివృద్ధికి ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

**సూర్య కరీంనగర్**






కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామానికి చెందిన దుండుగోల రవి అను నతడు తన యజమాని అయిన సుద్దాల పరశురాములు ఆదేశాల మేరకు మ్యాదరవేణి రాములు అనువారు తమ ట్రాక్టర్ల నందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు.అట్టి నిందితులను అదుపులోనికి తీసుకొని అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనది. తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది, ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## కుమ్మెర ఘటనపై నిందితులపై ఎస్సీ/ఎస్టీ, హత్య కేసులు నమోదు చేయాలి

**- రజక యువజన సమితి నాయకుడు గంగాధర చందు**

**సూర్య కరీంనగర్**



నాగర్‌కర్నూల్ జిల్లా తాండూర్ మండలం కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా జరిగిన పసిబిడ్డ మృతి ఘటనపై బాధ్యులపై వెంటనే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం మరియు హత్య కేసు నమోదు చేయాలని రజక యువజన సమితి నాయకుడు గంగాధర చందు డిమాండ్ చేశారు.రజక కులానికి చెందిన కీర్తన కుటుంబం దేవాలయంలోకి వెళ్లే సమయంలో అడ్డుకుని దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా, దాడి చేసిన ఘటనలో రెండు నెలల శిశువు ప్రాణాలు కోల్పోయిందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై సరైన చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా, ఒక కుటుంబ సభ్యుడికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## యునైటెడ్ టీమ్ వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్ టీమ్) వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షేక్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంస్థ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మైనారిటీ ఉద్యోగులు తమ సమస్యలను యునైటెడ్ టీమ్ దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యునైటెడ్ టీమ్ సెంట్రల్ యూనియన్ సభ్యుడు డాక్టర్ మహమ్మద్ అఖీల్ అహ్మద్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముబీన్ అహ్మద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సయ్యద్ అసద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహమ్మద్ బషీర్ హుస్సేన్, కోశాధికారి మహమ్మద్ షారూఖ్ ఖాన్, అహ్మద్ ఖాన్ (ఎస్.టి.ఓ.), సయ్యద్ యూనుస్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), మహమ్మద్ కలీం, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

**సూర్య, హుజురాబాద్ రూరల్**

హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామంలోని అంగన్ వాడి కేంద్రాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ ముషం సంగీత, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు అధ్యక్షుడు వన్నాల శివాజీ లు సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా అంగన్ వాడి కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆహార నాణ్యత, వంట విధానం, పరిశుభ్రత, ప్రభుత్వ పోషకాహార పట్టిక అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆహారం వండే వాతావరణం అత్యంత పరిశుభ్రంగా ఉండాలని, పిల్లల ఆరోగ్యం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



# మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

## - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. లైంగిక వేధింపుల నిర్మూలన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారిత కేంద్రం ద్వారా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిర్మూలన చట్టం-2013పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో లోకల్ కమిటీ మెంబర్ రాజా రెడ్డి ఈ చట్టంపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం ఈ చట్టం ఎంత ముఖ్యమో వివరించారు. లైంగిక వేధింపుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫిర్యాదులకు సంబంధించిన అంశంపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హాజరై మాట్లాడారు.



జిల్లాలో మండల స్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలు (ICC) ఏర్పాటు చేసి, మహిళల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. నోడల్ అధికారులు చట్టం గురించి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఓలు, ఎంపీడీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# వీణవంకలో ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## - 115 మంది హాజరు

**సూర్య, వీణవంక**

వీణవంక మండల కేంద్రంలో బుధవారం నుండి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మొదటి రోజు విద్యార్థులు సందడి చేశారు. పరీక్షల నిర్వహణపై వీణవంక ఎగ్జామినేషన్ ఇంచార్జ్ అరవింద పూర్తి వివరాలను వెల్లడించారు. వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 117 మంది విద్యార్థులకు గాను 115 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు



ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణ చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకుని తమ కేటాయించిన సీట్లలో ఆసీనులయ్యారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇంచార్జ్ తెలిపారు. "విద్యార్థులు పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయం కంటే ముందే చేరుకోవాలని, ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని, నేడు పరీక్షలు ప్రారంభం కావడంతో అటు బస్టాండ్, ఇటు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కోలాహలం నెలకొంది.

# మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

## - తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

**సూర్య కరీంనగర్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని



తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళ విద్యార్థినులకు స్కూటీలు, రూ.4,000 పెన్షన్ మంజూరు చేయాలని ఆయన కోరారు. ఇప్పటివరకు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం తక్షణమే హామీలు నెరవేర్చకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హరిప్రసాద్ హెచ్చరించారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


**సూర్య, హుజురాబాద్**

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం హుజురాబాద్‌లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హుజురాబాద్ పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకతీయ జూనియర్ కళాశాల, కేసి క్యాంపులోని మైనార్టీ జూనియర్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. కాగా మొదటి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 295 మంది విద్యార్థులను కేటాయించగా 288 మంది హాజరయ్యారు. మైనార్టీ కళాశాలలో 241 మందికి కేటాయించగా 235 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాకతీయ జూనియర్ కళాశాలలో 137 మంది విద్యార్థులను కేటాయించగా 118 మంది పరీక్షకు హాజరయ్యారు.పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా, పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త క్యాస ఉపేందర్ కుమారుడు డాక్టర్ సాయి లఖన్-డాక్టర్ జిశితల వివాహం బుధవారం హైదరాబాద్‌లో జరగగా నూతన వధూవరులను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ బాబు, బిసి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ రావు, మాజీ కౌన్సిలర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మైనార్టీ మోర్చా నేతల ఆధ్వర్యంలో మేయర్ కోలగని శ్రీనివాస్‌కు ఘన సన్మానం

**సూర్య కరీంనగర్**

బిజెపి మైనార్టీ మోర్చా కరీంనగర్ నేతలు కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ప్రప్రథమంగా తెలంగాణ



రాష్ట్రంలో కరీంనగర్ బల్దియాను బిజెపి కైవసం చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, మేయర్‌గా కోలగని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కోలగని శ్రీనివాస్‌ను వారంతా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ మోర్చా నేతలు పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్‌ను కోరారు. ముఖ్యంగా మస్జిద్ పరిసర ప్రాంతాలు మరియు మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి సమీ పరవేజ్ రాష్ట్ర నాయకులు ఎండి తాజ్, ఎండి బషీరుద్దీన్, జిల్లా నాయకులు ఎండి సమీ సిద్దిక్ షాదాబ్, ఎండి అపాన్ పాల్గొన్నారు.

# మావోయిస్టుల నిర్మూలన అసాధ్యం

## - కేంద్రంపై చాడ వెంకటరెడ్డి విమర్శలు

**సూర్య కరీంనగర్**



దేశంలో అసమానతలు, ఆకలి కేకలు ఉన్నంత వరకు మావోయిస్టు ఉద్యమం అంతం కాదని సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టుల ఏరివేతపై కేంద్ర ప్రభుత్వం డెడ్‌లైన్‌లు పెట్టడం అప్రజాస్వామికమని, మోడీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో పాలన సాగిస్తోందని విమర్శించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలు సమర్ధనీయం కాదన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లాలోని కుమ్మెర ఘటన అగ్రవర్ణ అహంకారానికి నిదర్శనమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఎఫ్ఐఆర్ కాపీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు ఎన్నికల హామీల మేరకు రైతు భరోసా సాయం వెంటనే జమ చేయాలని,సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. కాళేశ్వరం సహా దేవాదుల, మల్లన్నసాగర్ ప్రాజెక్టులకు మరమ్మత్తులు చేపట్టి సాగునీరు అందించాలని సూచించారు.ఈ సమావేశంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# స్కేటింగ్‌లో మెరిసిన అద్వితీ విద్యార్థిని శ్రీ సాన్వి

**సూర్య కరీంనగర్**

అద్వితీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని అంతర్ పాఠశాల స్కేటింగ్ పోటీలో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చింది. పి.శ్రీ సాన్వి (సీనియర్ కేజీ) తన సమతుల్యత, వేగం మరియు పట్టుదలతో విశేషంగా ప్రదర్శించి, కరీంనగర్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నిర్వహించిన అంతర్ పాఠశాల స్కేటింగ్ పోటీలో రజత పతకం సాధించింది.వివిధ పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులతో పోటీ పడుతూ, శ్రీ సాన్వి చిన్న వయస్సులోనే అద్భుతమైన నైపుణ్యం మరియు ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.పాఠశాల యాజమాన్యం చైర్మన్ కోమరయ్య సౌగాని, డైరెక్టర్ అనుదీప్ సౌగాని అలాగే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీ సాన్విని హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థి అంకితభావాన్ని, తల్లిదండ్రుల సహకారాన్ని వారు ప్రశంసిస్తూ, సమగ్ర అభివృద్ధి కోసం క్రీడల్లో మరింతగా పాల్గొనాలని ప్రోత్సహించారు.



# శాతవాహన ఫార్మసీ అధ్యాపకురాలు అశ్వినికి డాక్టరేట్

**సూర్య కరీంనగర్**

మానవ శరీరంలో హైపర్ టెన్షన్ (బిపి) నియంత్రణలో సాధారణ టాబ్లెట్లకు ప్రత్యామ్నాయంగా ఈప్రోనియోసోమ్స్ పద్ధతి పై చేసిన పరిశోధనకు గాను శాతవాహన ఫార్మసీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు జె. అశ్విని చేసిన పరిశోదనకు అనురాగ్ విశ్వావిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. అనురాగ్ విశ్వవిద్యాలయ ఫార్మాసీ విభాగములో డీన్ డాక్టర్ వసుధా భక్షి పర్యవేక్షణలో "ఫార్ములేషన్ డెవలప్మెంట్, ఆప్టిమైజేషన్ అండ్ ఇవాల్యుయేషన్ ఆఫ్ ప్రోనియోసోమ్స్ ఆఫ్ యాంటి హైపెర్టెన్సివ్ డ్రగ్స్" అంశంపై తన పరిశోధన చేసారు. డాక్టరేట్ సాధించిన జె అశ్విని కరీంనగర్ ఎల్ఎండి సమీపంలోని శాతవాహన ఫార్మసీ కళాశాలలో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తు, ఫార్మసీ మహిళా విద్యార్థుల వార్డెన్గా కొనసాగుతున్నారు.తనకు ఈ అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ యాజమాన్యముకు ఆధ్యాపకులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.



# కార్పొరేటర్‌ను సన్మానించిన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

**సూర్య కొత్తపల్లి**



నగరపాలక సంస్థలో విలీనమైన మల్కాపూర్ గ్రామం 16వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచిన సందర్భంగా మల్కాపూర్ గ్రామంలో కాంతాల జగన్ రెడ్డిని గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, కాసర్ల జితేందర్ రెడ్డి, కాంతాల ఇంద్రసేనారెడ్డి, గునుకుల మహిపాల్ రెడ్డి, కాంతాల బాపురెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్యామ సుందర్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి హిందువుల ఆరాధ్యుడు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా రూరల్ ప్రాంతమైన మల్కాపూర్ గ్రామంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పై వస్తున్న ఆరోపణల్లో నిజమెంత..!

## -అధికారిక విచారణ ఫలితం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

**సూర్య-గోదావరిఖని:**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల అనంతరం రాజకీయ వర్గాల్లో ఆరోపణలు చెలరేగాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ చేసిన వ్యాఖ్యలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. “ఆ రోజున నిజంగానే ఏమైనా జరిగిందా?” అనే ప్రశ్న ఇప్పుడు ఓటర్లలో కూడా వినిపిస్తోంది. కోరుకంటి చందర్ ఆరోపణల ప్రకారం, అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తన పదవీ ప్రభావాన్ని ఉపయోగించి 43 డివిజన్ లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు అవకతవకలకు పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. స్ట్రాంగ్ రూమ్ వద్ద కొంతసమయం విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఆ సమయంలో బ్యాలెట్ బాక్స్‌లతో చెలగాటం జరిగిందని ఓట్ల లెక్కింపులో అసాధారణ ఫలితాలు వచ్చాయని ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేశామని చెప్పినా ఫలితాలు భిన్నంగా వచ్చాయని అంటూ జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల అధికారులకు చందర్ ఫిర్యాదు చేశారు. 43 డివిజన్లలో రీ-పోలింగ్ జరపాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అసలు ఎన్నికల ప్రక్రియ ఎలా జరుగుతుంది అనే విషయాలను పరిశీలిస్తే పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు సీలింగ్ చేసి భద్రతతో స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచుతారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద



సీసీటీవీ పర్యవేక్షణ, పోలీస్ భద్రత ఉంటుంది. లెక్కింపు రోజున రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలోనే బాక్స్‌లు ఓపెన్ చేస్తారు. ప్రతి రౌండ్ లెక్కింపు తర్వాత వివరాలు నమోదు చేసి సంతకాలు తీసుకుంటారు. ఈ విధానం ప్రకారం అవకతవకలు జరిగే అవకాశం చాలా పరిమితంగా ఉంటుందని ఎన్నికల నిపుణులు చెబుతున్నారు. అయితే ఏదైనా అనుమానం ఉంటే పార్టీలు లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు తెలియజేసే హక్కు కలిగి ఉంటాయి. ఈ వ్యవహారం పై ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం నుంచి అధికారికంగా ఎటువంటి అవకతవకలు జరిగాయని ధృవీకరణ రాలేదు. ఫిర్యాదును పరిశీలనలోకి తీసుకున్నామని వర్గాలు తెలిపాయి. స్ట్రాంగ్ రూమ్ వద్ద విద్యుత్ అంతరాయం జరిగినా భద్రతా వ్యవస్థలు నిలకడగా పనిచేశాయని అధికారులు పేర్కొంటున్నారు. రాజకీయ ప్రతిస్పందనలు కాంగ్రెస్ నేతలు ఆరోపణలను ఖండిస్తూ, ఓటర్ల తీర్పును ప్రశ్నించడం సరికాదని చెబుతున్నారు. ప్రజలే తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో వెల్లడించారని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు పారదర్శక విచారణ జరగాలని, అనుమానాలకు ముగింపు పలకాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా రామగుండం నగరంలో ఓటర్లు మాత్రం మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఫలితాలు ఆశ్చర్యంగా ఉన్నాయని చెబుతుండగా, మరికొందరు ఎన్నికల్లో గెలుపు--ఓటములు సహజమని అంటున్నారు. స్పష్టమైన ఆధారాలు వెలుగులోకి రాకపోతే ఈ వివాదం రాజకీయ ఆరోపణల వరకే పరిమితం కావచ్చు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ఎన్నికల రోజు లేదా లెక్కింపు సమయంలో అవకతవకలు జరిగాయని నిర్ధారిత ఆధారాలు లేవు. అయితే ఫిర్యాదుపై విచారణ పూర్తయ్యాకే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల పారదర్శకత అత్యంత ముఖ్యం. అనుమానాలు ఉన్నప్పుడు చట్టపరమైన మార్గాల్లో ఫిర్యాదు చేయడం హక్కు. అదే సమయంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాజకీయ వేడిమిని పెంచే ప్రమాదం కూడా ఉంది. ఇప్పుడు ప్రజలు ఎదురుచూస్తున్నది ఒక్కటే.. అధికారిక విచారణ ఫలితం.

# ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

## - సమయానికి సెంటర్‌కు రాకపోవడంతో వెనుదిరిగిన ఇద్దరు విద్యార్థులు

**సూర్య కోరుట్ల**
రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కోరుట్ల పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మొత్తం 1321 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 50 మంది గైర్హాజరు కావడంతో 1271 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షల నిర్వహణను అధికారులు పర్యవేక్షించగా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగాయి. కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశారు. కోరుట్ల పట్టణంలోని మాస్ట్రో జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి సమయానికి రాకపోవడంతో ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాయకుండా వెనుదిరగాల్సి వచ్చింది. జగిత్యాల నివాసి రెహాన్ 16 నిమిషాలు ఆలస్యంగా రాగా, మహమ్మద్ తాజ్ 40 నిమిషాలు ఆలస్యంగా కేంద్రానికి చేరుకున్నారు. నియమావళి ప్రకారం నిర్ణీత సమయం దాటిన తర్వాత పరీక్షా హాలులోకి అనుమతించకపోవడంతో ఇద్దరు విద్యార్థులను లోపలికి





అనుమతించలేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయపాలన పాటించాలని అధికారులు సూచించారు.

# సమయపాలనలో లోపాలు...

## - ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తున్న కార్యాలయాలు - “ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్‌లో ఉన్నాం” అంటూ అధికారుల సమాధానం

**సూర్య, ముస్తాబాద్**
గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించాల్సిన పంచాయితీ రాజ్ విభాగంలో సమయపాలన లోపాలు బయటపడుతున్నాయి. పంచాయితీ రాజ్ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఏఈఈ,ఎంపీడీవో కార్యాలయాల్లో కొంతమంది అధికారులు విధి సమయాల్లో హాజరుకావడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రజలు సమస్యలతో కార్యాలయాలకు వస్తే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా అభివృద్ధి పనులు,బిల్లుల ఆమోదం, పథకాల అమలు వంటి అంశాల్లో ఆలస్యం జరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు.అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని,ఉన్నతాధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కార్యాలయాల్లో సమయపాలన కచ్చితంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**- జుమ్మా దుమ్మా వార్తలైనా పట్టించుకోని పంచాయతీరాజ్ ఏఈఈ --- సమయపాలనలో నిర్లక్ష్యం**

గ్రామాల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన పంచాయతీరాజ్ విభాగం ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) సమయపాలన పాటించకపోవడం స్థానిక ప్రజల్లో ఆగ్రహానికి దారి తీస్తోంది. “జుమ్మా డుమ్మా” అంటూ పత్రికల్లో వార్తలు వెలువడుతున్నప్పటికీ, సంబంధిత అధికారి తన విధుల్లో మార్పు తీసుకురావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా, “ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్‌లో ఉన్నాం” అని సమాధానం ఇచ్చినట్లు సమాచారం.అయితే మరుసటి రోజూ అదే పరిస్థితి కనిపించడంతో అధికారుల వివరణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే కార్యాలయానికి ముందస్తు సమాచారం లేకుండా తరచూ గైర్హాజరు కావడం వల్ల ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కార్యాలయానికి నిర్దిష్ట సమయానికి హాజరుకాకపోవడం సమస్యలు పేరుకుపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు.సంబంధిత ఏఈఈ పై తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్సారెస్పీ కెనాల్ లో గుర్తు తెలియని శవం లభ్యం

**సూర్య చొప్పదండి**
చొప్పదండి మండలం లోని పెద్ద కురుమ పల్లి గ్రామ శివారు ప్రాంతంలో గల జంగముని కుంట ప్రక్కన,ఎస్సారెస్పీ కెనాల్ లో బుధవారం రోజున గుర్తు తెలియని పురుషుని



మృతదేహం లభ్యమైందని ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు. మృతునికి వయసు సుమారు 40,50 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు, మృతుని బాడీ గుర్తు తెలియని విధంగా ఉబ్బి ఉందని , తలపై తెల్ల వెంట్రుకలు, ఒంటిపై గ్రీన్ కలర్ గీతలు గల షర్ట్ ఒకటి,ఎరుపు రంగు టీ షర్ట్ మరొకటి, లైట్ క్రీం కలర్ టీ షర్ట్ ఇలా మూడు షర్టులు ధరించి ఉన్నాడని,, అలాగే మూడు పాంట్స్ ధరించి ఉండి, అందులో ఒకటి జీన్స్ షార్ట్ నెక్కర్ , నలుపు రంగు ప్యాంటు మరొకటి లోయర్ ధరించి,నడుముకు వివిధ రకాల తాడులు ధరించి ఉన్నాడని, ఇతని వేషధారణ బట్టి మతిస్థిమితం లేకుండా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు . ఇట్టి విషయంపై గ్రామ పాలనా అధికారి రమేష్ దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు. అలాగే మృతుని వివరాలు తెలిసిన వారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు..ఎన్. నరేష్ రెడ్డి ఎస్ఐ, 87126 70766,,రైటర్ హెచ్ సి వేణు 9440501014 నెంబర్లకు ఫోన్ చేసి తెలుపాలని కోరారు..

## ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి

**సూర్య వెల్గటూర్**
ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వెల్గటూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన అవునూరి రమేష్(32)గత కొంతకాలంగా స్తంభపల్లి గ్రామానికి చెందిన లవంగం రాజేష్ దగ్గర డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. 24వ తేదీ సాయంత్రం ట్రాక్టర్లో మట్టి తీసుకెళ్లే క్రమంలో స్తంభపల్లి స్మశానవాటిక సమీపంలో రోడ్డుపై



గుంతల కారణంగా ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడడంతో రమేష్ కింద పడి తీవ్ర గాయాలు తగిలి మృతి చెందాడు. మృతుని తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

## అనారోగ్యాన్ని భరించలేక కెనాల్ లో దూకి మహిళ ఆత్మహత్య.

**సూర్య చిగురుమామిడి**
చిగురుమామిడి గత కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న అనారోగ్యాన్ని భరించలేక ఓ మహిళ కెనాల్ లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ పరిధిలోని బండారుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. బండారుపల్లికి చెందిన చెందిన బండారు కవిత(48) అనే మహిళ 24న రాత్రి తన కొడుకుతో కలిసి తిని పడుకుంది.ఉదయం



అందాదా ఐదున్నర గంటలకు ఆమె కొడుకు ప్రవీణ్ లేచి చూడగా ఆమె ఇంట్లో కనిపించలేదని, చుట్టుపక్కల ఎంత వెతికిన ఆచూకీ తెలియలేదన్నారు.వారి ఇంటి దగ్గర్లో గల కెనాల్ లో వెతకగా ఆమె మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు.కవిత భర్త పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారని,తాను కూడా గత కొద్ది రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతున్నదని,దీనివల్ల ఆమె తీవ్ర మనస్థాపానికి గురై ఎప్పుడు తనకు బతకాలని లేదని నేను చనిపోతాన అంటూ చెప్పేదని మృతురాలి కుమారుడు బండారి ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టంకై కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చిగురుమామిడి ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ వివరించారు.

## అనారోగ్యంతో యువకుడు మృతి

**సూర్య సెంటినరీ కాలనీ**
రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని రాంనగర్ కి చెందిన అల్లెపు రమేష్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కరీంనగర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



# చిన్నారి మృతి పై కొవ్వొత్తుల ర్యాలీ

## - దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలి - రజక సంఘం జిల్లా సమన్వయకర్త నాగేల్లి సాంబయ్య

**సూర్య, సెంటినరీ కాలనీ**

నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెర గ్రామంలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై రజక సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లికార్జున స్వామి దేవాలయం కళ్యాణోత్సవ దైవదర్శనానికి వెళ్లిన రజక కుటుంబం పై జరిగిన దాడి, ముఖ్యంగా రెండు నెలల పసికందును అమానుషంగా హత్య చేసిన ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనను ఖండిస్తూ, రామగిరి మండల కేంద్రంలోని సెంటినరీ కాలనీలో తెలంగాణ చౌరస్తా నుంచి మార్కెట్ చౌరస్తా వరకు పెద్దపల్లి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు పెంద్యాల మహేష్ సూచన మేరకు రజక సేవా సంఘం ఆధ్వర్యంలో సెంటర్లో కొవ్వొత్తులతో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. పసిపాప చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం రజక సంఘం జిల్లా సమన్వయకర్త నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ,అమాయక శిశువు "కుల వివక్షకు చెక్ పెట్టాలని ", "బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ", "నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వంటి నినాదాలతో ప్రాంతం మారుమోగింది. సంఘటనపై తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ



బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఎస్సీ సంఘం నాయకులు కనుకుంట్ల బానేష్ మాట్లాడుతూ కుల వివక్షతో రజక కుటుంబాలను గుడి ప్రాంగణం నుంచి బలవంతంగా బయటకు నెట్టి వేయడమే కాకుండా, పసికందుపై అమానుషంగా ప్రవర్తించి హత్య చేయడం మానవత్వానికి మచ్చ అని మండిపడ్డారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇచ్చి కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా వేగంగా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "అగ్రకుల అహంకార దాడులు సమాజాన్ని విభజిస్తున్నాయి. ఇలాంటి దుర్మార్గ చర్యలకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి" అని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, భద్రత కల్పించాలని కూడా కోరారు. ఈ ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందని, నిరపరాధ శిశువు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని రజక సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల జనరల్ సెక్రటరీ సీనియర్ జర్నలిస్ట్ రజక సంఘం సభ్యులు నల్లూరి లింగయ్య, బీసీ జేఏసీ నాయకురాలు, పెద్దపల్లి రజక సంఘం జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు మాదాసి శ్రీనివాస్, జేఏసీ నాయకులు మేదరవేన కుమార్ యాదవ్, చెలుకల జవహర్, నూనె రాజేశం, బత్తుల శంకర్, యాకూబ్, యాదగిరి ఒదెలు, కొండ సమ్మయ్య, శివ పటేల్, దేవ శ్రీనివాస్, పెద్దపల్లి రజక విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బండి రంజిత్ కుమార్, రామగిరి మండల రజక సంఘం అధ్యక్షుడు ధర్ముల రాజయ్య, పట్టణ అధ్యక్షులు పున్నం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి బండి మొండయ్య, చెలికట్ల మల్లేష్, కొదురుపాక భీమయ్య, కొల్లూరి రాములు, ధర్ముల శ్రీనివాస్, ధర్ముల భూమయ్య, ముస్కె రాజు, రేగళ్ల రాజేశం, లక్ష్మణ్, బండి సాయి, దర్ముల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్విజ్ పోటీలలో బండపల్లి ప్రథమ స్థానం

**సూర్య, చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలలో చందుర్తి మండలం బండ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. చందుర్తి రుద్రంగి మండలాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన పోటీలలో ఆయా మండలాలలోని కాంప్లెక్స్ స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచిన ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం రోజున మండల స్థాయి క్విజ్ పోటీలను మండల విద్యాధికారి వినయ్ కుమార్ ప్రారంభించగా చివరి నిమిషం వరకు ఉత్కంఠ భరితంగా జరిగిన పోటీలలో విద్యార్థులు చాకచక్యంగా మేధాశక్తిని ప్రతిభను చాటుకున్నారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీలలో బండపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలోనూ. తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలోనూ. స్థానిక పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడానికి క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ సౌజన్యంతో క్విజ్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు పరిసరాల పర్యావరణ ప్రకృతి వాటి అంశాలపై పోటీలను నిర్వహించడం జరిగిందని అన్నారు పోటీలలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అలాగే ప్రశంస పత్రాలను ముగింపు కార్యక్రమంలో అందజేశారు ఈ కార్యక్రమంలో చందుర్తి మూడపల్లి సనుగుల రుద్రంగి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ ప్రధాన ఉపాధ్యాయులు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమ స్ఫూర్తితో కుల సంఘం హక్కుల కోసం కృషి చేయాలి.

## - దర్శనం శంకర్ లాంటి వ్యక్తులు సంఘానికి ఎంతో అవసరం.

## - తెలంగాణ రాష్ట్ర మాస్టీ,మాస్టిన్ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నాగేళ్ల నరసయ్య.

**సూర్య, చిగురుమామిడి**

చిగురుమామిడి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన ఉద్యమ స్ఫూర్తితో మాష్టి,మాస్టిన్ హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని,ఎలాంటి ఇబ్బందులు ఉన్న సంఘం అండగా ఉంటుందని అధ్యైర్యపడవద్దని తెలంగాణ రాష్ట్ర మాష్టి,మాస్టిన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల నరసయ్య తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శనం శంకర్ రెండు రోజుల క్రితం ఆ సంఘానికి రాజీనామా చేసినట్లు ప్రకటించగా విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల నరసయ్యతోపాటు రాష్ట్ర కమిటీ దర్శనం శంకర్ ఇంటి వద్దకు వెళ్లి రాజీనామాకు గల కారణాలను అడిగి తెలుసుకుని, రాజీనామా



చేయడం సరైనది కాదని దర్శనం శంకర్ లాంటి వ్యక్తులు సంఘానికి ఎంతో అవసరమని శంకర్ అలాగే కొనసాగాలని వారికి నచ్చ చెప్పారు.దర్శనం శంకర్ కడు పేదరికంలో ఉన్నప్పటికీ కుల సంఘం కోసం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు.కుల సంఘంలో సమాఖ్య రాష్ట్రంలో ఏబిసిడి వర్గీకరణ కోసం శంకర్ అనేక పోరాటాలు చేశారని వారు గుర్తు చేశారు.మాష్టి,మాస్టిన్ జాతి కోసం చేసిన ఉద్యమాలు మరిచిపోలేనివి అని,ఎన్ని ఇబ్బందులు ఉన్నా మేము అండగా ఉంటామని వారు శంకర్ కు అభయం ఇచ్చారు.శంకర్ తాను ఇచ్చిన రాజీనామాను తిరస్కరిస్తున్నామని,అన్ని రంగాల్లో వెనుకబడ్డ జాతికి శంకర్ లాంటి వాళ్లు ఎంతో ముఖ్యమని,మాష్టి,మాస్టిన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దర్శనం శంకర్ కొనసాగాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నాగిళ్ల నరసయ్య,రాష్ట్ర కన్వీనర్ బుద్దుల రమేష్,రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ దర్శనం రాములు, తదితరులు ఉన్నారు.



# విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వాతావరణం

## - పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్

## - ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల సందర్శన

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్ గారు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను (Static Force) కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.?పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా పై పోలీసుల ఉక్కుపాదం

## - 13 ట్రాక్టర్లు సీజ్

**సూర్య, వీణవంక**



మానేరు వాగు పరివాహక ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణా పై జమ్మికుంట రూరల్ పోలీసులు విరుచుకుపడ్డారు. బుధవారం జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ, వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో భారీగా ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వివరాల్లోకి వెళ్తే... చల్లూరు గ్రామ సమీపంలోని మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ క్రమంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి, వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన 13 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. వాగుల నుండి ఇసుకను అక్రమంగా తరలించడం వల్ల భూగర్భ జల మట్టం పడిపోవడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని సిఐ పేర్కొన్నారు. నిరంతరం నిఘా కొనసాగుతుందని, అక్రమ వ్యాపారాలకు పాల్పడే వారు తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

# రజక సంఘ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ

**సూర్య, మెట్టుపల్లి రూరల్**



కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో రజకులను గుడిలోకి వెళ్ళకుండ అడ్డుకొని దాడిచేసి రెండు నెలల పసికందు ప్రాణాలు తీసిన దుర్మార్గులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు అనంతరం ఆత్మనగర్ గ్రామంలో కొవ్వతులతో రజక యువజన కమిటీ ఆధ్వర్యంలో కొవ్వతులతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

# నేటి నుండి తక్కల్లపల్లిలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**- సోమవారం ఉదయం నుండి మహా అన్నదానం - మంగళవారం ఉదయం వీధుల్లో రథ ఊరేగింపు**

**సూర్య - కథలాపూర్**



శ్రీ ఆండాళ్ సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుండి మండలశిలోని తక్కల్లపల్లి గ్రామంలో జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ చిలుక మర్రి సత్యనారాయణ చార్యులు తెలిపారు. గురువారం ఉదయం పుణ్యాహవచనం, అంకురారోప ణం, గరుడ కళ్యాణం, ధ్వజారోహణం,సాయంత్రం గోధూళి సుమూర్తమున స్వామి వారి కళ్యాణోత్సవం, శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ,అభిషేకం,హోమం, అష్ట బలి, తీర్థ ప్రసాద వినియోగం,కుంకుమ పూజ,సాయంత్రం నిత్య హోమం, సూర్య వాహన సేవ,శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్య అర్చన, హోమం,నివేదన, బలి ప్రదానం, హారతి, తీర్థ ప్రసాద వినియోగం, సాముహిక సత్యనారాయణ వ్రతం,సాయంత్రం నిత్య హోమం, చంద్ర వాహన సేవ,ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్య అర్చన, హోమం,నివేదన, బలి ప్రదానం, హారతి, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం నిత్య హోమం, హంస వాహన సేవ,సోమవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్య అర్చన, నిత్య హోమం, నివేదన, గరుడ వాహన సేవ,సాయంత్రం డోలో త్సవం, వసంతోత్సవం,అనంతరం బంతులాట, తదుపరి హెచ్చరికలు, రాత్రి రథ హోమం,దర్శనం,భక్తులు కొబ్బరికాయలు కొట్టుట, మంగళవారం ఉదయం ఉదయత్ పూర్వం స్వామి వారి రథారోహణం, స్వామి వారి రథ ఊరేగింపు, సాయంత్రం ఆలయ సంప్రోక్షణ, అభిషేకములు, తిరుమంజనం, పూర్ణహుతి చక్ర తీర్థం, తీర్థ ప్రసాద వితరణ,బుదవారం ఉదయం నాగవల్లి దేవతోద్వాసన,ధ్వజారోహణం, బలి ప్రదానం, గ్రామబలి,సాయంత్రం సప్తవర్ణాలు, రూత్విక్ సన్మానం, రాత్రి స్వామి వారి ఏకాంత సేవ అనంతరం ఉత్సవ పరి సమాప్తి అవుతుందని సోమవారం ఉదయం నుండి మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలు యాజ్ఞికులు బ్రహ్మ శ్రీ పతికి రాజా శేఖారా చార్య, బ్రహ్మ శ్రీ తత్వాధి కృష్ణ శర్మ, ఆనంద్ చార్య ల ఆధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు.

## దమ్మయపేటలో పులి సంచారం

**- గ్రామస్తుల్లో భయాందోళనలు**

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని దమ్మయపేట గ్రామ పరిసరాల్లో పెద్ద పులి ప్రత్యక్షమై గ్రామస్తుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామానికి ఆనుకుని ఉన్న పొలాల వద్ద పులి సంచరిస్తున్నట్లు స్థానికులు గమనించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.వెంటనే సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామ పరిసరాల్లో పులి అడుగుజాడలను గుర్తించి జాగ్రత్త చర్యలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ గులాం మొయినుద్దీన్, డిప్యూటీ రేంజర్ మునిరుద్దీన్ తదితరులు గ్రామంలో పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు.పశువులను బయట వదిలేయకుండా ఇంటి దగ్గర పశువుల పాకలో కట్టివేయాలని, రాత్రి వేళల్లో ఎవరూ ఒంటరిగా బయటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండా లని సూచించారు. పులి కనిపించిన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని స్పష్టం చేశారు.పులి కనిపించిన వార్తతో గ్రామంలో భయాందోళన వాతా వరణం నెలకొంది. ప్రజలు గుంపులుగా చర్చించుకుంటూ పులి ఎటు వైపు వెళ్లిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది పర్య వేక్షణ కొనసాగిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు.

## బ్రెజిల్ దేశంలో లిథియం మైనింగ్ లో భాగస్వామ్యానికి సింగరేణికి ఆహ్వానం

**- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసిన సి.బి.ఎల్ కంపెనీ ప్రతినిధులు**

**సూర్య సెంటినరీ కాలనీ**



తాము చేపట్టిన లిథియం మైనింగ్ లో సింగరేణి సంస్థ భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్ దేశానికి చెందిన ప్రముఖ సి.బి.ఎల్ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసి వివరాలను తెలియచేసారు.సి.బి.ఎల్ (కంపాన్హియా బ్రసిలీరా డి లిటియో) బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమే, సి.బి.ఎల్ సీఈవో వినీసియస్ అల్వారెంగా తమ కంపెనీ వివరాలను తెలియజేశారు. బ్రెజిల్ దేశంలో ఇప్పటికే తాము లిథియం మైనింగ్ చేపట్టామని, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల పట్ల ఆసక్తితో ఉన్న నేపథ్యంలో తమ కంపెనీలో భాగస్వామిగా చేరినట్లయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు వివరించారు. తాము సింగరేణి తో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీలను కూడా సంప్రదిస్తు న్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేడు ప్రపంచంలో లిథియం కీలక ఖనిజానికి ఉన్న ప్రాధాన్యత, వ్యాపార కోణంలో ఉన్న లాభదాయకత గురించి వివరించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన వివరాలను డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్)గౌతమ్ పోట్రు వివరించారు. బ్రెజిల్ దేశంలో కీలక ఖనిజ అవకాశాలను, లాభదాయకత తదితర అంశాలను తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## పారిశుద్ధం, తాగునీటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా

**- మున్సిపల్ ఛైర్మన్ వేముల నాగలక్ష్మి**

**- ధర్మపురి అభివృద్ధికి కృషి చేస్తా**

**- గోదావరి పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు**

**సూర్య ధర్మపురి:**



పారిశుద్ధం, తాగునీటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ధర్మపురి మున్సిపల్ ఛైర్మన్ వేముల నాగలక్ష్మి తెలిపారు.జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ ఛైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన వేముల నాగలక్ష్మి బుధవారం ఛైర్మన్ గా పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాగలక్ష్మిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో ధర్మపురిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని, ధర్మపురి పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. భక్తుల సౌకర్యార్థం గోదావరిని పవిత్రంగా ఉంచేందుకు మున్సిపల్ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన 14 మంది కౌన్సిలర్ల, ధర్మపురి ప్రజల నమ్మకాన్ని నిలబెడతానని హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లను నియమించలేదు

**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కమిటీ సభ్యులు మంథని మున్సిపల్ ఛైర్మన్ కు వినతి**

**సూర్య మంథని**



మంథని మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు గా ఎవరిని నియమించ లేదని ఆరవ వార్డు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని మున్సిపల్ ఆరవ వార్డు కౌన్సిలర్ పోతర బోయిన శ్రీలత క్రాంతి లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు, అసత్య ఆరోపణలు చేస్తూ, వారు మతిభ్రమించి మాట్లాడుతున్నారని,వారు చేస్తున్న ఆరోపణలో ఎలాంటి నిజం లేదని కమిటీ సభ్యులు గుండ రాజు, తీగల సమ్మయ్య, పోలు శివ లు బుధవారం మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. మంథని మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డులలో ఏ వార్డులో లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వినతి మేరకు 54 ఇండ్లను ఆరో వార్డులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించాడని వారు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలని, పూర్తి సహకారం అందిస్తామని, ఎవరైనా లబ్ధిదారులను బెదిరింపులు గురిచేస్తే తమ దృష్టికి తీసుకొస్తే , మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. కొందరు తమ రాజకీయ లబ్ది కోసమే అధికార కాంగ్రెస్ పార్టీని,పార్టీ కార్యకర్తలను బదునాం చేస్తున్నారని పోతారవేణి రాజయ్య, అల్లెం వినయ్, కొంతం శ్రీను, మోహన్, నాయని సంతు ఆరోపించారు.

## ప్లాస్టిక్ నిషేధం పై న్యాయవాది ఉద్యమం.

**- పోస్టు కార్డు ద్వారా ప్రభుత్వానికి వినతి.**

**సూర్య జగిత్యాల :**



సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం పై నిషేధం విధించాలని జగిత్యాల కు చెందిన న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఉద్యమం చేస్తున్నారు.మధుసూదన్ రెడ్డికి 2025 మే లో క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. అప్పటి నుండి బసవ తారకం హాస్పిటల్ లో చికిత్స చేసుకుంటు క్యాన్సర్ గూర్చి పోరాటం చేస్తున్నారు. సింగిల్ యూస్ నిషేధం గూర్చి ప్రధాన మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ల కి వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. ఈ వ్యాధి బారిన ఇతరులు పడకుండా చర్యలు చేపట్టాలని, పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభం చేశారు. జగిత్యాల లోని విద్యాసంస్థలు, న్యాయ వాదుల ద్వారా ఇప్పటికి పది వేల పోస్ట్ కార్డుల ద్వారా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం కోసం మధుసూదన్ ఉద్యమం చేస్తున్నారు. న్యాయవాది చేస్తున్న ఉద్యమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది.

## అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు.

**- స్పందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్.**

**- నూతన విగ్రహం ఆవిష్కరణ.**

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని హనుమాన్ వాడలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. స్థానిక నాయకులు, కౌన్సిలర్ కూతురు శేఖర్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి అంబేద్కర్ విగ్రహం ఎత్తుకెళ్లిన విషయాన్ని తెలుపగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జగిత్యాల పట్టణ సిఐ కరుణాకర్ కి విషయాన్ని తెలిపి విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన వారిని త్వరగా గుర్తించాలని కోరారు. వెంటనే స్పందించిన పోలీస్ లు అంబేద్కర్ విగ్రహ స్థలాన్ని పరిశీలించి అనుమానితులను విచారించి అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన వారిని గుర్తించి అంబేద్కర్ విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. తక్షణమే స్పందించి పోలీస్ శాఖను, అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కి స్థానిక వార్డు నాయకులు ప్రజలు అంబేద్కర్ సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## మౌన ర్యాలీ నిరసన కార్యక్రమం ను విజయవంతం చేయాలి

**- మండల అధ్యక్షులు శంకేశి రవీందర్**

**సూర్య సెంటినరీ కాలనీ**



కుమ్మెర మల్లన్న దేవాలయంలో కుల వివక్షతో రెండు నెలల పసిగుడ్డు మృతికి కారకులైన నరహంతకులను తక్షణమే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలనే డిమాండ్ తో నిర్వహించే మౌన ర్యాలీ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని రామగిరి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్ పిలుపునిచ్చారు. మంథని లో గురువారం ఉదయం 10.00 గంటలకు జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం ద్వారా ఆర్డీవో కార్యాలయం వరకు మౌన ర్యాలీ నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొంటారని తెలిపారు. కావున బీఆరెస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ వాదులు, బీసీ సంఘాల నాయకులు, మానవతావాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఏసీబీ తనిఖీల్లో పట్టుబడిన పెద్దపల్లి ఎంఏఓ అలివేణి సస్పెన్షన్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

అవినీతి ఆరోపణలతో ఏసీబీ తనిఖీల్లో చిక్కిన పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కె. అలివేణిపై వేటు పడింది. ఆమెను విధుల్లో నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు, ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అలివేణి అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన ఏసీబీ నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. విచారణ ముగిసే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సదరు అధికారి ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు

# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

## - అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**సూర్య రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు వచ్చే నెల (మార్చి) 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు నిర్వహించనున్నారని తెలిపారు. 7,317 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరీక్ష జవాబు పత్రాలను



ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.పరీక్ష జరుగుతున్నంత సేపు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు.విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష సమయం అనుకూలంగా తగినంత బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షలు కొనసాగే సమయంలో సమీప జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.ఆయా పరిధిలో ఉన్న మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పరీక్ష కేంద్రాలను ముందస్తుగా పరిశీలించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రంలో వసతులను ఏర్పాటు చేయాలని, ఏఎన్ఎం ను అందుబాటులో ఉంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రదేశాల్లో వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, డీటీఓ నవీన్ కుమార్, ఆర్టీసీ, పోస్టల్, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో పోలీస్ యాక్ట్ అమలు

## - పోలీస్ నియమాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు - వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్

**సూర్య,వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రతీ రోజు 24 గంటలపాటు నిషేధాజ్ఞలు విధిస్తూ వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 1861 పోలీస్ చట్టం రూల్ 30 ప్రకారం ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

**- రోడ్లపై ఆందోళనలు వద్దు**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ లేదా సంబంధిత పోలీస్ అధికారి, సంబంధిత సబ్-డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి లేకుండా ప్రజలకు అసౌకర్యం కలిగేలా ఎటువంటి ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించ రాదు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగిస్తూ గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధించబడ్డాయి.



**- ఆయుధాలపై నిషేధం**

కత్తులు, కర్రలు, ఈటెలు, తుపాకులు వంటి ప్రమాదకర వస్తువులను వెంట తీసుకెళ్లడం, రాళ్ళు లేదా విసిరే వస్తువులు సేకరించడం, తీసుకెళ్లడం నేరం.

**- ధ్వని కాలుష్యానికి నో**

అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, డీజేలు, వాహనాల ద్వారా హారన్, వియోగించి ప్రకటనలు చేయడం నేరం.

**- మినహాయింపులు వీరికి మాత్రమే**

కేవలం విధుల్లో ఉన పోలీసులు, సైనిక సిబ్బంది, హోంగార్డులతో పాటు నిజమైన అంత్యక్రియల ఊరేగింపులకు మాత్రమే ఈ ఆంక్షల నుండి మినహాయింపు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యం

## - జీరో పెండెన్సీ సాధనకు దృఢసంకల్పం - సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి

**సూర్య-గోదావరిఖని:**

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల భవిష్య నిధి (సీఎంపీఎస్/పెన్షన్) దావాలను తక్షణ పరిష్కారం చేయడం లక్ష్యంగా తాము పనిచేయడం జరుగుతుందని, కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి అన్నారు. ఈ మేరకు బుధవారం ఇక్కడి ఆర్జీ-1 ఏరియా జిఎం కార్యాలయ సమావేశ హాల్ లో సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో 6వ "ప్రయాస్" ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రీజినల్ కమిషనర్-2 కె.గోవర్ధన్ తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్లో ఉన్న పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ క్లెయిమ్లను వేగవంతంగా పరిష్కరించి "జీరో పెండెన్సీ" సాధించడమే తమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా 100 రివైజ్డ్ పీపీఓ (పెన్షన్



పేమెంట్ ఆర్డర్స్)లను ఆర్జీ-1 జిఎం డి.లలిత్ కుమార్ కు అందజేశారు. సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సీఎంపీఎఫ్, కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని స్పష్టం చేశారు. పెండింగ్ క్లెయిమ్‌లు ఉన్న వారు గనుల సంక్షేమాధికారులను సంప్రదించాలని సూచించారు. మార్చి నెల చివరిలో పెన్షన్ పొందే ప్రతి ఒక్కరూ "జీవన్ ప్రమాణ్" పూర్తి చేయాలని కోరారు. ఈ నెలాఖరులో పదవీ విరమణ పొందనున్న రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్, పర్సనల్ అధికారులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. వారి సేవలను ప్రశంసిస్తూ, శేష జీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ సమావేశంలో ఎస్.ఓ.టు జీఎం చంద్రశేఖర్, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీభాయి, పర్సనల్ అధికారులు వేణు, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, ఫిరోజ్ ఖాన్, గనుల సంక్షేమ అధికారులు గణేష్, నిహాల్ సాయి, నాగరాజు, అకౌంట్స్ ఆఫీసర్ రజిని తదితరులతో పాటు సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభం

**సూర్య, తంగళ్ళపల్లి**



తంగళ్ళపల్లి మండలం రామచంద్రపూర్‌లో జాతీయ ఉపాధి హామీ పనులను గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంధం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొన్నాల నరసింహులు, వార్డు సభ్యులు గడ్డం లహరి, గంధం లక్ష్మి, గంధం రమేష్, శేఖర్, అమృత, మాధవరెడ్డి, చక్రపాణి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించిన మచ్చుపేట సర్పంచ్

**సూర్య ముత్తారం**



మచ్చుపేట సర్పంచ్ చిలువేరి జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు ఉచిత కుట్టు మిషన్ అలీప్ సంస్థ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ మహిళలు సొంతంగా ఉపాధి పొందేలా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ కేంద్రంలో మహిళలకు నిపుణుల ద్వారా కుట్టు మిషన్ లో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధిని పొందేందుకు ఈ కేంద్రం తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంతుల రాకేష్, వార్డ్ సభ్యులు కోమల్లా సంధ్య, కలవేన దేవరాజ్, బందరపు సాగర్, దుండే జ్యోతి రాణి, సీఏ కోమలత, విఓ రమాదేవి, ఆకుల స్రవంతి, సతీష్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**సూర్య,రాయికల్**



బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల అధ్యక్షుడు డాక్టర్ హేమంత్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.రాయికల్ మండలం లోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యం లో 115మంది బాలికలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి,అనీమియా తో బాధపడుతున్న 73 మంది బాలికలకు నెలకు సరిపడ మందులు,సానిటరి ప్యాడ్స్ పంపిణీ చేశారు.అనంతరం బాలికలకు వారి ఆరోగ్యంను ఎలా కాపాడుకోవాలో,రక్త హీనత ఎలా వస్తుందనే విషయాలను వైద్యులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డా.అచ్యుత్, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాహితీ,గ్రామ సర్పంచ్ గుర్రం భావన మహేందర్ గౌడ్,మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్,స్థానిక గ్రామీణ డాక్టర్ జక్కుల రాజేంద్ర ప్రసాద్,వైద్య సిబ్బంది రమ,ప్రకాష్,శ్రీనివాస్,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు తాటిపెల్లి వేణుగోపాల్, కమారుద్దీన్, కూరగాయల సురేష్, శైలజ పాల్గొన్నారు.

# పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే 'చెరసాలే'

## - వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ - ముగ్గురు వ్యక్తుల రిమాండ్

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణ పరిధిలో మంగళవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న బ్లూ కోర్ట్ పోలీస్ అధికారులతో దురుసుగా ప్రవర్తించి, వారి విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.బ్లూ కోర్ట్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నిందితులు పవన్ కళ్యాణ్, రాహుల్, సుమన్ వారిపై దురుసుగా ప్రవర్తించారు. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై గుమిగూడటం, అతివేగంగా బైక్‌లపై తిరుగుతూ ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.

# సింగరేణి అధికారులకు కోల్ ఇండియా హక్కులను కల్పించాలి

## - అడ్రియాల జీఎం కొలిపాకకు వినతిపత్రం
## - అధికారుల సంఘం అధ్యక్షుడు కోల

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థలో పనిచేసే అధికారులకు కోల్ ఇండియా మాదిరిగా హక్కులను కల్పించాలని ఏపిఎ జీఎం కొలిపాక నాగేశ్వరరావుకి అధికారుల సంఘం (సిఎంఓఏఐ) ఆర్జీ-3 అధ్యక్షులు కోల శ్రీనివాస్, అధికారులు వినతి పత్రం అందజేశారు. కోల్ ఇండియా కంపెనీలో చెల్లించుచున్న అన్ని భత్యాలు పే అప్-గ్రేడేషన్, పి.ఆర్.పి చెల్లించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి ఉద్యోగులకు ప్రకటించిన ఇతర భత్యాలు అధికారులకు కూడా అమలు చేయాలని, వివిధ పదోన్నతుల సమస్యలు పరిష్కరించాలని, ఛార్జ్ షీట్ విచారణలను పారదర్శకంగా నిర్వహించి త్వరితగతిన ముగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో సెక్రటరీ ఎస్.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బి.టి.మురళి కృష్ణ, ట్రెజరర్ బి. విక్రమ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సి.జె.సురేఖ, ఎస్వోటు జీఎంలు ఏం.రామ్మోహన్, బి.సత్యనారాయణ, సివిల్ డిజిఎం రాజేంద్రకుమార్, అధికారులు పాల్గొన్నారు.

# పత్రికా విలేఖరిపై దాడి అప్రజాస్వామికం

**సూర్య మేడిపల్లి / భీమారం**



భీమారం మండల వార్తాపత్రిక విలేఖరి అందే అశోకును తను పంపిన వార్త వ్రాయలేదని చరవాణి ద్వారా అసభ్య పదజాలంతో దూషించి బెదిరింపు చర్యలకు పాల్పడిన మన్నెగూడెం గ్రామనివాసి శంభోజు మహేందర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రోజు స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో వార్త పత్రిక విలేఖరి అందే అశోక్ పిటిషన్ ను దాఖలు చేశారు. నిందితుడిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఉమ్మడి మేడిపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు అంతే అశోక్ కు మద్దతుగా నిలిచారు.

# బడికి వెళ్లిన పిల్లలు భద్రమేనా...?

## - ప్రమాదం జరిగినపుడే హడావిడి - ప్రైవేట్ పాఠశాలలపై నజర్ కరువు

**సూర్య మల్లాపూర్**

ప్రైవేట్ బడులకు పంపుతున్న తమ పిల్లలు ఇంటికి చేరే దాక భద్రమేనా అని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రైవేట్ యాజమాన్యాల నిర్లక్ష్యానికి అద్దం పట్టినట్లు తరచు ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. మండల కేంద్రంలోని వికాస్ మోడల్ స్కూల్ ప్రైవేటు పాఠశాల కు చెందిన టాట మ్యాజిక్ వాహనంలో బుధవారం ఉదయం పాతదామరాజ్ పల్లి, వాల్గోండా గ్రామాల నుండి విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తున్న క్రమంలో బోల్తా పడి ప్రమాదం చోటుచేసుకుంది. వాహనంలో 10మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా ఇద్దరికి తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స



కోసమై జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో విద్యార్థుల తలిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఏదిఏమైనప్పటికీ వెళ్లివస్తాము అమ్మ అని చెప్పి ఇంటిని చేరే వరకు ఏ ప్రమాదంలో చిక్కుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు యాజమాన్యాల నిర్లక్ష్యమే ఈ ప్రమాదాలకు దారితీస్తుందని మండల వ్యాప్తంగా పలు విమర్శలకు దారి తీసింది. ఇంతకీ ఆ వాహనం పాఠశాలకు సంబంధించినదేనా? ఫిట్నెస్ కలిగి యాజమాన్య పత్రాలు వున్నాయా? పాఠశాలకి ఎన్ని వాహనాలు డ్రైవర్లు ఎందరు ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి వుంది. మండలంలో ప్రైవేటు పాఠశాల వాహనాల ప్రమాదాలు తరచు జరగడం విద్యాశాఖ, ఆర్టీవొ, పోలీసు అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రైవేటు యాజమన్యాలు విద్యార్థుల ఫీజుల సేకరణలో చూపిస్తున్న శ్రద్ద సంరక్షణలో చూపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ‘ఖని’లో రజక సంఘం కొవ్వొత్తుల నిరసన

## - నాగర్‌కర్నూల్ ఘటనపై తీవ్ర ఆగ్రహం, నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్

**సూర్య-గోదావరిఖని**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో చోటు చేసుకున్న అగ్రకుల పెత్తందారుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ, రజక చిన్నారి మృతికి సంతాపంగా బుధవారం రాత్రి పట్టణ ప్రధాన చౌరస్తాలో గోదావరిఖని రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రజక సంఘ సభ్యులు, మహిళలు, యువకులు, స్థానికులు పాల్గొని ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.నిరసన సందర్భంగా పాల్గొన్న వారు కొవ్వొత్తులు వెలిగించి చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రజక సంఘం నాయకులు దామనపల్లి రాజేశం, కొండపర్తి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్‌లో జరిగిన దాడి పాషవిక చర్య అని తీవ్రంగా ఖండించారు. సమాజంలో బడుగు,



బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని పేర్కొన్నారు.“బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా ముందుకు వచ్చి ఇలాంటి ఘటనలను ఖండించాలి. సామాజిక న్యాయం కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉంది” అని పిలుపునిచ్చారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్టు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు పూర్తి భద్రత కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గోదావరిఖని రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు బండి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాగుల రవీందర్, ఉపాధ్యక్షులు జాలిగపు ఐలయ్యతో పాటు కంచర్ల సారయ్య, నిమ్మల సమ్మయ్య, గుండ్రాతి నారాయణ, మావురపు మల్లేష్, శనిగరపు రాజేశం, ముక్కెర శ్రీనివాస్, పొలంపల్లి సారయ్య, పసునూటి సంపత్, బిజిగిరి వెంకటరాజం, ఎజ్జ రాజయ్య, నగునూరి రాజేశం, శంకర్, నాంపల్లి సమ్మయ్య, మునుగంటి పోషం, కనకయ్య, కొమురయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. నిరసన శాంతియుతంగా ముగిసింది. ఘటనపై ప్రభుత్వం, పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేయడం కనిపించింది.

## “కట్ల శంకర్ రెడ్డి” కుటుంబ సభ్యులను పరామర్శించిన “ఎమ్మెల్యే సత్యం”

**సూర్య రామడుగు**



రామడుగు మండలం తిరుమలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కట్ల శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే డిసిసి జిల్లా అధ్యక్షులు మేడిపల్లి సత్యం పరామర్శించి శంకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గా 35 ఏళ్లు గ్రామానికి విశేషంగా సేవలు చేశారని కొనియాడారు. ఆయన సేవలు కాంగ్రెస్ పార్టీలో మరువరానివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోలి రామయ్య పల్లి సర్పంచ్ నునుగొండ అంజలి, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఐదుగురు దొంగలు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**- సీఐ మొగిలి**

**సూర్య తంగళ్లపల్లి**

తల వెంట్రుకలను దొంగిలించిన ఐదుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన అబ్బ వేణి చిన్న ఎల్లయ్య తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ ఉంటాడు. జనవరి 10, 2026 రోజున 8 క్వింటాళ్ల తల వెంట్రుకలను బొలెరోలో లోడ్ చేసుకుని జగిత్యాల నుండి హైదరాబాద్ వెళుతుండగా తంగళ్ళపల్లి మండలం పద్మ నగర్ పెట్రోల్ బంక్ వద్ద ఏడుగురు వ్యక్తులు ఆర్టీవో అధికారుల లాగా బెదిరించి వాహనాన్ని ఎత్తుకెళ్లాడన్నారు.

## వెల్లుల్ల విద్యార్థులను అభినందించిన జిల్లా విద్యాధికారి

**సూర్య మెట్పల్లి రూరల్**



రాష్ట్ర స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ “ఖో ఖో “పోటీలలో జగిత్యాల జిల్లా తృతీయ స్థానం సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల గ్రామానికి చెందిన విద్యార్థులు నవీన్, అభిలాష్ మరియు మిథున్ రాజ్ లను జిల్లా విద్యాధికారి కె. రాము కార్యాలయములో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.ఖో ఖోలో చక్కటి శిక్షణ అందిస్తున్న పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కొమురయ్య,

## గ్రామపంచాయతీ కార్మికుని కుటుంబానికి 50వేల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..

**సూర్య బోయినపల్లి**

చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో గత 25 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్న ఎదురుగట్ల మల్లయ్య ఇటీవల అనారోగ్యం తో



మరణించగా. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం కింద యాభై వేల రూపాయల(50,000/-) మల్లయ్య భార్య మల్లమ్మకి అందచేసిన చొప్పదండి శాసనసభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ “వెంకటేశ్వర” ఆలయంలో “వైభవోపేతం”గా పుష్పార్చన

**- కన్నుల పండువగా కళ్యాణ మహోత్సవం**

**సూర్య రామడుగు**

రామడుగు మండలం వెదిర గ్రామం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా 54వ వార్షికోత్సవ అధ్యాయన కళ్యాణ మహోత్సవ కార్యక్రమం బుధవారం కన్నుల పండుగగా కొనసాగింది. వేద



పండితులు మంత్రోచ్చారణల మధ్య శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విశేషాలు అభిషేకం పుష్పార్చన ఆధ్యాయనోత్సవం ద్రావిడ వేద పారాయణం స్వామి వారి ఆరాధన నివేదన తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్యాణోత్సవం నిర్వాహకులు బీరెడ్డి సుమన-ప్రేమ్ సాగర్ రెడ్డి (ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్) డాక్టర్ బారాది సుప్రజ-ప్రణయ్ కుమార్ రెడ్డి గుర్రాల సుశ్విత- త్రినాథ్ రెడ్డిలతో పాటుగా దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చెన్నమనేని రాజేందర్ రావు మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, చెన్నమనేని రవీందర్రావు, రెడ్డి సంఘం అధ్యక్షులు దొడ్డ లచ్చిరెడ్డి, గ్రామస్తులు, మహిళలు, భక్తులు, చిన్నారులు, యువకులుపాల్గొన్నారు.

## నేటి నుండి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు..

**- వారం రోజులపాటు ఘనంగా ఉత్సవాలకు ఏర్పాట్లు**

**- ఆలయ చైర్మన్ వీర్ల సరోజన ప్రభాకర్ రావు**

**సూర్య రామడుగు**

రామడుగు మండలం వెలిచాల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమై వచ్చే నెల నాలుగు వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వీర్ల సరోజన ప్రభాకర్రావు తెలిపారు. శుక్ర



వారం స్వామి వారి కళ్యాణం ఉత్సవం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చైర్మన్ వీర్ల సరోజన ప్రభాకర్ రావు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు గ్రామస్తులు పరిసర గ్రామాల ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు

**- అవగాహన కల్పించిన పోలీసులు**

**సూర్య కోరుట్ల**

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణం లోని నంది చౌరస్తా వద్ద ప్రత్యేక డ్రంక్



అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోరుట్ల సీఐ బి. సురేష్ బాబు ఆధ్వర్యంలో, ఎస్సై ఎం. చిరంజీవి మరియు సిబ్బంది చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ బి. సురేష్ బాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే జైలు శిక్ష లేదా జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.ప్రజల ప్రాణ భద్రత కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## ఎన్నికల్లో ఓడిన... మాట నిలబెట్టుకున్న హరిబాబు

**సూర్య హుజురాబాద్**

ఇచ్చిన మాటలను, హామీలను గెలిచిన అభ్యర్థులే నిలబెట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్న ఈ రోజుల్లో ఎన్నికల్లో ఓడిన ఓటర్లకు ఇచ్చిన హామీనీ తీర్చి హుజురాబాద్ పట్టణంలో గుర్రం హరిబాబు తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నాడు. ఇటీవల జరిగిన హుజురాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుర్రం హరి



బాబు పోటీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తన వార్డులో ఏ ఆడ కూతురు వివాహం జరిగిన వారికి 10,116 రూపాయలు ఇస్తానని వాగ్దానం చేశాడు. దురదృష్టవశాత్తు ఎన్నికల్లో ఆయన ఓడిపోయాడు. కానీ హరిబాబు తాను ఓటర్లకు ఇచ్చిన మాటను తప్పకుండా బుధవారం తన వార్డులో యంజాల భాగ్య- వాసుల కుమార్తె శ్రావ్యకు వివాహం జరగగా ఆ వేడుకల్లో గుర్రం హరిబాబు 10,116 రూపాయలు పెళ్లి కుమార్తెకు అందజేశారు.అంతేకాకుండా ఆడపిల్ల పుడితే కూడా రూ. 10,116 అందజేస్తానని హామీ ఇచ్చారు. కాగా ఎన్నికల్లో ఓడిపోయిన వాగ్దానాన్ని నిలుపుకుంటున్న హరిబాబు ను పలువురు అభినందిస్తున్నారు.

# కోరుట్లలో జవహర్ నవోదయ విద్యాలయం స్థల పరిశీలన

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత**

**సూర్య కోరుట్ల**

కోరుట్ల పట్టణంలో ప్రతిపాదించిన జవహర్ నవోదయ విద్యాలయం స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత బుధవారం పరిశీలించారు.విద్యాలయం నిర్మాణానికి అనుకూలంగా గుర్తించిన భూమిని ఆమె సవివరంగా పరిశీలించి, భూమి విస్తీర్ణం, సరిహద్దులు, రహదారి సౌకర్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అనుకూలమైన, ప్రశాంత వాతావరణం కలిగిన స్థలాన్ని ఖరారు చేయాలని సూచించారు.భూమికి సంబంధించిన రికార్డులను



సమగ్రంగా పరిశీలించి ఎలాంటి వివాదాలు లేకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన నివేదికలను సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా అన్ని ప్రక్రియలు నిర్వహించాల్సిందిగా స్పష్టం చేశారు.నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోయే ఈ విద్యాలయం ద్వారా ప్రాంతీయ విద్యార్థులకు నాణ్యమైన ఉచిత వసతి విద్య అందుబాటులోకి వస్తుందని ఆమె తెలిపారు. ప్రతిపాదనలను వేగవంతంగా పూర్తి చేసి ఉన్నతాధికారులకు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోరుట్లలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ

**సూర్య కోరుట్ల**



కోరుట్ల పట్టణంలోని పీఎం బాలుర జిల్లా పరిసత్ హై స్కూల్ లో జిల్లా స్థాయి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం (స్కూల్ కాంప్లెక్స్ సమావేశం) నిర్వహించారు.ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, బోధన విధానాల్లో మెరుగులు చేర్చడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్, నల్ల భూమయ్య మాట్లాడుతూ ఉర్దూ మీడియం విద్యార్థులు పదో తరగతిలో శాతం వంద ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా సమగ్ర శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అబ్దుల్ భారీ శిక్షణ అందించారు. ఉపాధ్యాయులు ఎండీ అబ్దుల్ రావూఫ్, లయీక్, అజర్ అక్బర్, సలీం పాల్గొన్నారు. సి.ఆర్.పిలు మాన్విత, పి. గంగాధర్, జ్యోతి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొడిమ్యాలలో ఘనంగా రేణుక ఎల్లమ్మ పట్నాలు

**- మంత్రి పొన్నం, ఎమ్మెల్యే మేడిపల్లి శుభాకాంక్షలు**

**సూర్య కొడిమ్యాల**



కొడిమ్యాలలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ పట్నాలు, బోనాల పండుగ భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల ఐక్యత, అమ్మవారి పై ఉన్న అచంచల విశ్వాసం ఈ వేడుకలో స్పష్టంగా ప్రతిఫలించింది. పండుగ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతు, తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉత్సవాలు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు. రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు.  ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కొడిమ్యాలలో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. పాత సంప్రదాయాలను కొనసాగిస్తూ యువత కూడా పెద్దఎత్తున పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. రేణుక ఎల్లమ్మ అమ్మవారి దయతో మండల ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. మొత్తం మీద కొడిమ్యాలలో రేణుక ఎల్లమ్మ పట్నాలు, బోనాల పండుగ ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య విజయవంతంగా ముగిసింది.



## ఎలిగేడు మండల కేంద్రంలో ఘనంగా దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండల కేంద్రంలో బుధవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తానిపర్తి మోహన్ రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ముందుగా పటాకులు కాల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు. పార్టీ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రం మొత్తం పండుగ వాతావరణంలో కళకళలాడింది.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, దాసరి మనోహర్ రెడ్డి నాయకత్వంలో పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, సుల్తాన్‌పూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మాజీ సర్పంచ్‌లు కొండయ్య రాజ, స్వప్న కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ ఆస్థుల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి

**- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పసుల బాలరాజు**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి ఎస్ అండ్ పిసి సిబ్బంది సంస్థ ఆస్థుల పరిరక్షణే ధ్యేయం గా విధులు నిర్వహించాలని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పసుల బాలరాజు అన్నారు. ఆర్జీ-2 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం సెక్యూరిటీ విభాగంతో ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బాలరాజు హాజరై డిపార్ట్మెంట్ రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఎఫ్ఐఆర్ లు నమోదైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఐఆర్, సీనాఫ్ అఫెన్స్ (సిడిఎఫ్), రిమైండ్ సిడి, కన్వెషన్ రిపోర్ట్, ఛార్జ్ షిట్స్, నేర ప్రవృత్తి, లోక్ అదాలత్, మెగా అదాలత్, కోర్టు డ్యూటీస్, బెయిలబుల్, నాన్ బెయిలబుల్, వ్యక్తుల మనస్థత్వాలు, సాటి ఉద్యోగులతో,కుటుంబ సభ్యులతో, పిల్లల పట్ల వ్యవహరించాల్సిన  తీరుతెన్నుల గురించి విశదీకరించారు. సంస్థ ఆస్థుల పరిరక్షణే ధ్యేయం గా విధులు నిర్వహించాలని, దొంగతనాలు జరగకుండా అరికట్టాలని హితబోధ చేశారు. ఈ సమావేశంలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్లు షరీఫ్ మహ్మద్(ఆర్జీ-2), మహ్మద్ షబ్బీరుద్దీన్(ఆర్జీ-3), సీనియర్ ఇన్ స్పెక్టర్ పోగుల స్వామి, జూనియర్ ఇన్ స్పెక్టర్ పిపి రాజయ్య, సీనియర్ సెక్యూరిటీ గార్డ్స్ డి.శ్రీనివాస రావు,  కట్కూరి సురేష్, ఇంటెలిజెన్స్ గార్డ్ యం.డి. మహబూబ్ అలి, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్లు సాయి తేజ, లింగారెడ్డి పాల్గొన్నారు.



## జేఎన్టీయూహెచ్ బి-జోన్ క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

**సూర్య, సెంటినరీ కాలనీ**

జేఎన్టీయూహెచ్ కు అనుబంధంగా ఉన్న బి-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ ను బుధవారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బులుసు విష్ణువర్ధన్ ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీ నుంచి 12 జట్లతో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కు కళాశాల పూర్వ విద్యార్థులు, రామగుండం క్రికెట్ అసోసియేషన్, సింగరేణి అదికారుల క్రికెటర్లు మరియు కళాశాల యాజమాన్యం ఆర్థిక సహాయం అందజేస్తుందని అలాగే ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన జేఎన్టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల విద్యార్థులు ఈ టోర్నీలో పాల్గొంటారని, బయటి కళాశాల క్రికెట్ జట్లకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామనీ ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బులుసు విష్ణువర్ధన్ తెలిపారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుమన్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పింగిలి కృష్ణారెడ్డి, సునీల్ కుమార్ గౌడ్, క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వాతావరణం

**- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్**

**- ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల సందర్శన**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐ.పి.ఎస్ గారు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను (Static Force) కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.?పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా పై పోలీసుల ఉక్కుపాదం

**- 13 ట్రాక్టర్లు సీజ్**

**సూర్య, వీణవంక**

మానేరు వాగు పరివాహక ప్రాంతంలో యధేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణా పై జమ్మికుంట రూరల్ పోలీసులు విరుచుకుపడ్డారు. బుధవారం జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ, వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో భారీగా ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వివరాల్లోకి వెళ్తే... చల్లూరు గ్రామ సమీపంలోని మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ క్రమంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి, వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన 13 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. వాగుల నుండి ఇసుకను అక్రమంగా తరలించడం వల్ల భూగర్భ జల మట్టం పడిపోవడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని సిఐ పేర్కొన్నారు. నిరంతరం నిఘా కొనసాగుతుందని, అక్రమ వ్యాపారాలకు పాల్పడే వారు తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.